శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# షణ్ముఖ విజయం
## అను
# కుమార సంభవము

**1. దక్షయజ్ఞము 2. గిరిజా కళ్యాణం 3. తారక సంహారం**

రచన :
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
**M.Tech.**



## ముందుమాట

పరమేశ్వరుడు కూడా మనందరిలాగే మనో వైకల్యాలు చెంది, బాధలనుభవిస్తాడు. ఇక మనం యెంత? అని సర్ది చెప్పుకుని సుఖ దుఃఖాలనుభవిస్తూనే నిర్వికారులై యుండాలనే వాదనకు పట్టుగొమ్మలు మన పురాణాలు. నిరాకారుడైన బ్రహ్మమును సాకారుడుగా దర్శించటం మన ఆనందం పదిల పరుచుకుని ఆ భగవంతుడి ధ్యాసలో యుండుటకు చేసే ప్రయత్నాలే యివి అన్నీ.

సదా శివుడి పెండ్లికి పిండి వంటలు చేయటం, శోభనం ఏర్పాట్లు, దేవ దానవులు యుద్ధాలు చేయుట, సద్యోగర్భాన శిశువులు కలగటం, స్తన్యం త్రాగి పెరుగుట, ఇదంతా రస స్ఫూర్తికోసం మునులు దర్శించిన అద్భుత దృశ్యం. అదే కల్పనా చాతుర్యంతో పురాణం అయింది. ఇది మెదడునుంచి పుట్టే కవిత్వం కాదు, హృదయం భక్తితో నిండి పొర్లిపోతుంటే కళ్ళే మనస్సుగా మారి మనస్సు దానికి సహజమైన వికారాలనన్నింటిని అనుభవిస్తూ చెప్పిన కథలు. ఎప్పుడు



చెప్పారో ఎవరికీ తెలియదు, ఎలా చెప్పారో కూడా తెలియదు. ఎవరు దానిని గ్రంధస్థం చేశారో తెలియదు. గురువులు చెప్పారు శిష్యులు విని తరతరాలకి అందించారు. ఆ గురువు సూత మహర్షి కావచ్చు, వశిష్టుడు కావచ్చు, శుక్రుడు , వైశంపాయనుడు.... ఇలా గురువులు శిష్యులకు చెప్పారు.

ఆ పరంపర కొనసాగింది. శిష్యులు చెప్పినా అది గురువు వాణి మాత్రమే. ఉదాహరణకు రామదాసు గారు జైల్లో శిక్ష అనుభవిస్తూ సీతమ్మా! నువ్వన్నా ఆ రామ చంద్రుడికి నాగురించి చెప్పు తల్లీ! అని ఏడుస్తుంటే ఆ పాటలు ఎవరు విన్నారు, ఎవరు గ్రంధస్థం చేశారు? తెలియదు, తెలిసినట్లు ఇంకొకరు నచ్చజెప్పినా అది నిజమోకాదో తెలియదు.

అందుకని కోడిగుడ్డు మీద వెంట్రుకలు పీకకుండా భగవంతుడి ప్రేరణచే ఎవరు వ్రాసినా అది రామదాసు



గారు వ్రాసినట్లేనని భావించండి. ఈ ప్రస్తుత శివగాధలు కూడా అంతే.

ఇంకొకమాట, ఈ కథల్లో కాల పరిమాణం మనకు తెలిసింది కాదు. అదికూడా ఆ మునుల ఊహే. వేయి సంవత్సరాలు శివపార్వతులు ఆనందంగా గడిపారంటే 365000 రోజులని కాదు. చాలా కాలమని.

నారదుడు చెప్పిన వెంటనే షణ్ముఖుడు వలీ ప్రేమలో పడటం సాధ్యాసాధ్యాలు వెతకనవసరం లేని పురాణ గాధ మాత్రమే.

మునులు దర్శించిన దృశ్యం మనం కూడా దర్శించాలంటే భక్తి, శ్రద్ధ, నిష్ఠ కావాలి. 'టి.వి' కాదు, దానికి ప్రయత్నం కావాలి. దానికి పట్టుదల కావాలి. దానికి భగవత్ కృప కావాలి.

ఆ పరమాత్మ కృప అందరిపై సదా ఉండాలని నాకోరిక.

మరి మొదలు పెట్టండి.

# ప్రార్థన

ఉ॥ శ్రీగణనాథునిన్ గొలిచిజేతును పూజలు
సాయమీయగన్
జాగునుమానివ్రాసెదను శైలజ శంకర
ప్రేమకావ్యమున్
నా గతజన్మ భాగ్యమున నాకు లభించిన
దివ్యశక్తిచే
వాగను శాసనున్ వలచు భామకు మ్రొక్కెద
ధన్యుజేయగన్

మ॥ ఒరిగేదేమిటి కంసవైరి! ధనముల్ యున్నంత
యింకొద్దిగా
సిరులున్ భాగ్యములేల నాకు వెగటై
చేమోడ్చి వద్దందురా
సరియా నేరము లెంచనేడు, జతవై సాయంబు
నందించరా
బరువై పోనుర కోట్లమంది పిలువన్
పంచంగ నీ ప్రేమలన్



ఆ॥ అంటరాని తనము అడుగంటెనీ నాడు
అంటబోవు నన్ను అంటనీవు
అంటుగట్ట పెరుగు నంటారు మొక్కలు
అంటనీయకున్న అంతమవదు

చం॥ నలువను గూడు భామినిని నాకు సహాయము
జేయవేడెదన్
తలపున నాదునిల్చినను ధన్యుని జేయగ
భావ వాహినీ
సలిల తరంగ వీచికలు చల్లగ తాకుచు
కైతలై మదిన్
కొలచుచు వాణి కీర్తనలు కూర్మిని పాడెద
సారెసారెకున్



సీ॥ భవబంధములు ద్రుంచ భక్తితో ప్రార్థింతు
పరమేశ్వరునకివే ప్రణతు లిత్తు
దయజూపి కాపాడు దాక్షాయణీ నాథ!
దక్షిణామూర్తినిన్ దరికి బిలుతు
ముక్కోటి దేవతల్ ముందు జేరిన గాని
ముక్కంటి గొలిచెద ముఖ్యుడనుచు
మాట రాకుండుచో మదితలతునొ లేదా
మృత్యుంజయుని నేడె ప్రీతి గొలుతు

తే॥ వ్యోమకేశుని జూచెద నా మనమున
భూతనాథుని కాత్మలో పూజజేతు
గరళ కంఠుని వేడెద భారమేసి
ఫాలనేత్రునికివె నాదు వందనములు



చం॥ సిరిగల అమ్మ సైచెతను శ్రీపతి భామల పెక్కు
గూడినన్
పరువును కోరి పార్వతియు భర్తను గంగకు
పంచి యిచ్చెగా
సరియిక జెప్పనే వలదు సౌఖ్యములా శచి
యేమి బొందెనో
సరసిజ భవ్వు నాలి తన స్వామిని 'వంచెను'
విద్య రాణియై

కం॥ శంకర! భక్తవ శంకర
జంకేలర భక్తి గొలుతు శంకలవేలా?
అంకమునందున నిల్పుచు
లెంకను ననుగావుమయ్య లెస్సగ దయతో

శా॥ వేగన్ బోవలె రమ్మనంచు పిలుచున్ వింతైన
ఆ దూతయున్
ఆగన్ వీలవదంచు కేకలిడినన్ అల్లాడగా
జేయు, నా
ప్రేగుల్ పిండెడి బాధతోటి అపుడో విష్ణూ
అనన్ సాధ్యమా
ఓ గోవింద! అసాధ్యమౌను 'హరి' యే ఉత్కృష్ట
నామంబురా

కం॥ ఇల్లాలు 'భిల్ల కన్యక'
తల్లేమో 'కొండరాజు తనయట', అన్నొ
మెల్లగ నడిచే 'కరిముఖి'
చెల్లిక, ఈ అయ్య అయ్య శిష్యులు దనుజుల్



సీ॥ ఎల్లరూ మావల్ల ఈశ్వరా కాదన్న
వీర్యంబు గంగలో వీడెనంట
రెల్లు గడ్డిన బుట్టి తల్లి స్తన్యము లేక
ఆరుమోముల బిడ్డడలమటించ
పతులొదిలిన ముని పత్నుల చనుబాల
పెరిగినాడీ బిడ్డ వింత శిశువు
క్రౌంచ పర్వత గిరిన్ ఖండించి నాడంట
దనుజుల నవలీల దునిమె నంట

తే॥ భీరులై పారిపోయిన వేల్పులంత
తారకాసురు జంపెడి వారులేక
వేద నొందెడి వారిని ఆదరించు
షణ్ముఖుని నేడు ప్రార్థింతు సవినయముగ



# షణ్ముఖ విజయం
## అను
# కుమార సంభవము

అతి భక్తితో తనను జేరిన శౌనికాది మునులకు, సూత మహాముని అనేక పురాణములు, దైవ గాథలు వినిపించాడు. వారిద్వారా మానవ లోక కళ్యాణం జరిపించాడు.

అట్లే ఒక పర్యాయం వారికి, ఈశ్వరుని గాథలు తెలుపుచూ, దక్ష యజ్ఞంలో భార్య సతీదేవిని గోల్పోయి, విరాగియై యున్న పరమేశ్వరు మరు జన్మలో పార్వతిగా జన్మించిన లోకమాతను పరిణయమగుట, తారకుడను రాక్షసుడు ఈశ్వర వీర్యసంజనితుడైన పుత్రునిచేతనే మరణించగల వర గర్వితుడై లోక కంటకుడై యుండగా, షణ్ముఖుడు (ఆర్ముగం) బుట్టి ఏడురోజులలోనే పెక్కు ఘన కార్యములు జేసి, దేవసేన అనునామెను బెండ్లాడి దేవతల సేనానియై ఘోర యుద్ధంలో తారకాంత మొనరించి, దైవ ఘటనచే జనించిన వల్లి అను భిల్ల కన్యకను పరిణయ మాడు గాథలు విన్నవించాడు.

ఆ క్రమంబెట్టిదనగా.........



# దక్ష యజ్ఞము

బ్రహ్మయొక్క కన్నుల నుండి మరీచి, హృదయము నుండి భృగువు, స్మృతులనుండి అత్రి, శిరస్సునుండి అంగీరసుడు, తొడలనుండి అంధకుడు, జానువులనుండి కర్దముడు, ప్రాణంబులనుండి దక్షుడు, వ్యానంబు నుండి పులహుడు, అపానంబునుండి క్రతువు, సమానంబునుండి వశిష్ఠుడు, ఉదానమునుండి పులస్త్యుడు, సంకల్పమునుండి ధర్ముడు, మనంబు నుండి రుచియు, సృష్టింప బడిరి. సృష్టి జరుపుటలో వీరి సహాయము అవసరమైనది. వీరంతా ప్రజాపతులు.

ఇందులో దక్ష ప్రజాపతి వృత్తాంతము మిక్కిలి రసవత్తరము.

ఆ॥ శివుని మామ యగుట జేత ఆదక్షుండు
వసుధఖ్యాతి గాంచె వైర మొంది
తప్పులన్నిగాయు అప్పరమేశుని
గాధ విన్న జన్మబాధ తొలగు

వ॥ **ఆ దక్ష ప్రజాపతి భార్యపేరు ప్రసూతి. వారికి అరువది నలుగురు పుత్రికలు. వారిలో పదిమందిని ధర్మునికి, ఇరువది ఏడుమందిని చంద్రునకు, పదిముమ్మ్వురను కశ్యపునకు, నలుగురిని వైనతేయునకు, ఇద్దరిద్దరు జొప్పున భృంగికి, కృశాశ్వునకు,గిరికి యిచ్చి వివాహము జేసి వారిచే దేవ దానవ మానవ, జంతు, పక్షి, జలచర, సర్పజాతులను అభివృద్ధి జేయించెను. ఆపై తనకు మిక్కిలి అనుకూలురైన కుమార్తెలైన స్వాహను అగ్నికి, రతిని మన్మథునికి సతిని పరమేశ్వరుడైన శంకరునికి యిచ్చి వివాహము జేసెను.**



**దేవ, దానవ, మానవ, జంతు, పక్షి, జలచర, సర్ప క్రిమి జాతులు పెక్కు వృద్ధి చెందెను. సూర్య చంద్రులు పగలు రాత్రి భూమిపై వెలుగు, శక్తి నీయగా అష్ట దిక్కులను వాటిపాలకులు నిర్దేశించగా సృష్టి కొనసాగెను. తన అల్లుళ్ళను శాసించగల బ్రహ్మనని దక్షుడు మిక్కిలి గర్వముతో నుండెను.**

తే॥ రతి మదనులును జీవుల మతిని జేరి
కామవాంఛలు కలిగించి కలియజేసి
సంతుబెంచిరి జీవుల జతలు గలిపి
అవని నిండెను పెరుగంగ జీవకోటి

వ॥ ఇదిట్లుండగ ఇరువది ఏడు పుత్రికలనిచ్చి చంద్రునకు తన కుమార్తెలను ఏ బేధ భావములేక చూచుకొమ్మని శాసించిన



కం॥ తన సతులను ఒకరీతిగ
మనసున ప్రేమించమన్న మాటకు చంద్రుం
దనుకూలుండవకుండా
తను రోహిణి దగ్గరయ్యె తమితో గూడెన్

తే॥ అలిగి క్షయరోగి కమ్మని అల్లునికిని
శాపమిచ్చెను కోపము నాపలేక
తనదు పుత్రిక లేడ్వగ తప్పు దెలిసి
పక్షమున క్షయ, ఆపైనయనెను.

వ॥ ఈవిధంగా దక్షునికి భయపడి అందరూ అనుకూలురై అతని గర్వమును బెంచిరి.

సీ॥ సత్యలోకంబున చక్కగా బ్రహ్మయు
సృష్టి ప్రజాపతుల్ జరుప జూచె



వైకుంఠ వాసుడై విష్ణుమూర్తియు దాను
స్థితిజూచె జగతిని సిరులు కలుగ
కైలాస వాసియై గరళ కంఠుడు తాను
లయ కారకుండయ్యె స్వయముగాను
దివిలోన దేవతల్ దేవేంద్రు గూడుచు
పైజేరు వారికి పంచిరి సుధ

తే॥ జీవకోట్లకు జన్మలు అవిరళముగ
కలిగె భూమిపై జీవుల కర్మవలన
నరకమందిరి పాపులు నలిగి రచట
సృష్టి తిరిగెను లోకాల సృజనపెరిగె.

వ॥ మానవులు జేయు పాప కర్మల వలన జగతిలో ప్రకృతి భగవానుడు నిర్దేసించినట్లు జరుగక అతివృష్టి, అనావృష్టి, భూకంప, అగ్ని, ప్రమాదములు, వరదలు, రోగములు, హింస, అకాల మృత్యువు మొదలైన భయంకరోత్పాతములచే జీవకోటి బాధిల్లు చుండును.

కం॥ క్రతువులు జేతురు మునులును
సతతము భువి గాచుచుంద్రు సజ్జనులిలలో
అతిప్రీతిని భగవంతుడు
జతయై పాపంబు మాన్పి జగతుల గాచున్

వ॥ అదేక్రమంలో ఒకప్పుడు మహా మునులందరూ గలసి



కం॥ మానవ కళ్యాణమునకు
పూనుచు యొక యాగమట్లు భువిని ప్రయాగన్
మౌనివరేణ్యులు సలుపగ
దానికి పిలు పంపి నారు తము యెల్లరకున్

తే॥ ఆహుతులకందరకును మర్యాద జరిగె
విడిది ఏర్పాట్లు చూచెనా విశ్వకర్మ
మూడు లోకాల వాసులు ముదము నొంది
బాగుబాగని మెచ్చిరి బ్రాహ్మణులును

వ॥ దేవేంద్రుడు స్వయముగా పర్యవేక్షణ జేయుచు ఆహుతులను ఆహ్వానించెను. జగత్కళ్యాణమునకు జరుగు యాగమున సర్వులూ ఆహ్వానితులే.



తే॥ నలువ, విష్ణు, మహేశులు కొలువు కాగ
దేవతలు వేల సంఖ్యలో దీరినారు
భూసురుల వేదమంత్రాల పుడమి అదర
మునులు జరిపిరి క్రతువును మోదమలర

వ॥ అంతట శిష్య సమేతుడై యేతెంచిన దక్ష ప్రజాపతిని జూచి సభికులందరితోబాటు దేవేంద్రుడు, బ్రహ్మ, విష్ణువులు గౌరవ పూర్వకంగా లేచి నిలబడి పలుకరించిరి. కొందరు అతని నోటికి జడిసి వినయం నటించిరి. అందరి ఆహ్వానం అందుకుంటూ సభలోకి అడుగు పెడుతున్న అతను అక్కడ ధ్యాన ముద్రలోనున్న మహాదేవుని జూచెను. శంకరుడు తనకు మన్నింపు నివ్వలేదని అల్లునిపై అలిగి ఉక్రోషంతో కోపం పట్టలేక దక్షుడిలా అన్నాడు.



ఆ॥ సభికులార వినుడు చక్కంగ నామాట
ఆర్యులనగ వింటి నదియె జుమ్మి
ఏమిలేని విస్తరెగిరెగిరి పడును
అన్నరీతి ఇచట నున్న వీని

తే॥ వంకరపు బుద్ధి, క్రూరుడు పలు విధముల
కన్యరాశిలో స్థితులగు కాలమంత,
మూడు ఏకాదశుల దాక ముడుపులందు
అనరె 'జామాత దశమ గ్రహమ' ని జనులు

వ॥ నేను పిల్లనిచ్చిన మామనేగాక అందరికీ పూజ్యుడనైన ప్రజాపతిని. నేను జేసిన పొరబాటు ఇపుడు తెలిసి వస్తున్నది. అందుకే వియ్యానికైన కయ్యానికైన సమ ఉజ్జీలుండాలంటారు.

ఉ॥ వీనికి పిల్లనిచ్చితిని వీనిని యేమననయ్యె

జెప్పుడీ

చేనునె మేయు కంచెవలె చేటును దెచ్చెడి

ధూర్తుడీతడున్

మానములేని వాడితడు మన్నన యన్నది

లేనెలేదు, ఈ

దానవ ప్రీతి పాత్రునకు తక్కువ బుద్ధుల

శూలపాణికిన్

వ॥ వీనికి ఈ బైరాగికి ఇంత అహంకారము దేనికో తెలియుట లేదు.



సీ॥ ధనదుండు అందునా ధరియించు బూదియే

మితిలేని ధనమేల మిడిసి పాటు

ఇంద్రుడా చంద్రుడా ఈ అందగానికి

బేసి కన్నులు జూడ వెగటు గలుగు

భూతనాధుడు వీన్కి పుర్రెలే మణులంట

ఎద్దు వాహనమేది ఇంగితమ్ము

విష సర్పహారాలు వీని జుట్టుచునుండ

నమ్మదగునే వీని, నాశకరుడు

తే॥ సభను మెలగుట తెలియదు చదువులేదు

గౌరవించుట నేర్వదు కర్కశుండు

బుద్ధిలెరుగడు తలిదండ్రి బోధలేదు

మామనైతిని నాకర్మమంట గలసె

వ॥ ఆ మాటలకు ఆగ్రహోదగ్రుడైన నందీశ్వరుడిలా అన్నాడు. ఓరీ నీచుడా దక్షా!



సీ॥ పాలసంద్రమునుండి వెలువడ గరళంబు

తానెదిక్కయి మీకు త్రాగె దాని

రుద్రభూమిని గాచు రుద్రుడే లేకున్న

పైశాచ గణములు వరలుచుండు

ముక్కంట జూచిన ముజ్జగాల్ దహియింప

బదునంచు తపమునే బరగునతడు

వ్యోమకేశునికేల బుద్ధి హీనుల వోలె

అందచందాలపై అమిత రక్తి

తే॥ తత్త్వమెరుగక పరమాత్మ దారి గనక

తొత్తులల్లుళ్ళు అని జూచు తులువ వీవు

మదము తలకెక్కి మర్యాద మరచునిన్ను

ఏమిజేసినన్ పాపము ఎరుకకాదు.



కం॥ నీకెవడు పదవి నిచ్చెను

నీకీ పొగరేల ఖలుడ! నీచుడ శివునే

లేకిగ తిట్టితివి కదా!

నీకాతల తెగును పడును నిప్పున దక్షా!

తే॥ వీని దుశ్చర్య ఖండించ వెరపు జెంది

మంచి జెప్పని విప్రులు వంచకులగు

అన్యకులముల వారిచే అలుసు జేత

హేయముగ జూడ బడుదురు ఇలను తాము

వ॥ కోపంతో ఒళ్ళు తెలియని నందీశ్వరుని శాంతపరచి శివుడు బ్రాహ్మణ నింద పాపము తగదు. నీశాపము దైవారాధన, ఆచారములేని వారికి మాత్రమే వర్తించుగాక అని బలికెను.

ఆ॥ అత్తమీద కినుక దుత్తపై జూపుట
ఏమి న్యాయమయ్య? హితవుకాదు
భూసురులకు శిక్ష పుణ్యమా? హితవౌనె
శాపభయములేని జనులు కలరె?

వ॥ బ్రాహ్మణులంతా పాహి పాహి మహదేవా అని సాష్టాంగ పడుచుండగా కోపంతో చిరు బురులాడుచూ దక్షుడు అచటనుండి వెడలిపోయెను. మునులు దేవతలు ఏదో విధంగా క్రతువు అయింది అనిపించి ఎవరి నెలవులకు వారు వెడలి పోయిరి.

వ॥ దక్ష ప్రజాపతి ఈశ్వర ద్వేషియై శివునకు హవిర్భాగ మీయక వాజపేయమను యాగమును భృగు మహర్షి ఆధ్వర్యములో శిష్య సమేతుడై జేసెను.



ఆ॥ తృప్తిజెందదాయె దీనితో దక్షుండు
పరమశివుని మీద పగను బూని
గొప్ప యాగమొకటి గురు 'బృహస్పతి' పేర
చేయదలచినాడు శివుని వీడి

వ॥ యాగ ద్రవ్యములను పెద్ద యెత్తున సేకరించి పేరుపేరున శివుని దాక్షాయణిని దక్క అన్యకుమార్తెలను అల్లుళ్ళను బంధు మిత్రులను ఆహ్వానించి, తన సతీ సమేతుడై యాగ దీక్ష బూనెను

తే॥ విశ్వ కర్మచే వెలయించె విడిది వసతి
దేవ గంధర్వ కిన్నెర దివిజు లెల్ల
అత్రి భృగు కశ్య పాదులు అచట జేర
నారదాదులు వచ్చిరి వెరపు జేత



తే॥ హరుడు రానట్టి క్రతువుకు హరియురాడు
హరియు లేకుండ బ్రహ్మ రానేరడెపుడు
యాగ ఆహుతులందర సగముపైన
శాప భయమున జేరు అశక్తులాయె

వ॥ ఆ మహాయాగమునకు ఎనభై ఎనిమిది వేలమంది ఋత్విక్కులు, అరువది నాలుగువేలమంది ధాతృ గణంబులు అధ్వర్యులు దీక్షను బూని దక్షునికి ప్రసూతికి యాగ దీక్షను యొసంగిరి. ఈశ్వర భక్తులైన మరీచి, దధీచి భృగువు యాగమునకు వచ్చి శివుని గానక దక్షుని ప్రశ్నించిరి. దానికి దక్షుడు అదరక బెదరక ఇలా అన్నాడు.

ఆ॥ కర్మహీనుడైన కైలాసనాధుడు
భూత ప్రేతపు మరుభూమి దిరుగు
కర్మ భ్రష్టుడయిన కాపాలి బిలువను
దోషమేమి యిందు ద్రోహమేమి?

వ॥ దానికి దధీచి యిలా అన్నాడు.



ఆ॥ హరుడు లేని యాగ మెరుగవే జరుగదు
కీడు కలుగు నీకు కీర్తి తరుగు
ఇచట నున్నవారు ఏడ్చుట తథ్యమౌ
శాపమిడెను మౌని కోపమెగిసి

వ॥ ఈ విధంగా శపించి దధీచి, వామదేవుడు, గౌతముడు, శిలాదుడు మరీచి మొదలైన శివభక్తులతో అచటనుండి విస విసా వెడలిపోయెను. కంగారు పడుతున్న ఇతరులతో దక్షుడు భయపడకుండ తనయాగమును పూర్తి జేయింపమని నచ్చజెప్పెను.

వ॥ ఒకనాడు కైలాసమున ఇష్టులైన చెలికత్తెలతో వన విహారము జేయుచున్న సతీ దేవికి.

ఆ॥ ఆకసంబునందు ఆ సతి గాంచెను
అవనికేగుచున్న దేవతలను
వారివల్ల దెలిసె వారిజాక్షియుదాను
దక్షయజ్ఞమునకు తరలి రనుచు

కం॥ శంకరుని డాసి పార్వతి

జంకున మృదు మధురమైన స్వరమున నడిగెన్

ఇంకా యోచనలెందుకు

లెంకలతో బోవదగునులే సర్వేశా!

కం॥ మా తండ్రి చేయు జన్నము

నే తనయను జూడకున్న నిందలు బడుదున్

నీతికి బాహ్యము అపై

ఏ తీరున మనసు నిలుచు యికనో నాథా!

వ॥ చిరునవ్వుతో ఆదిదేవు డిట్లనెను.

ఆ॥ మనకు పంపలేదు మామ ఆహ్వానంబు

దేవతలకు నెల్ల తెలిపి కూడ

పిలువకున్న నెపుడు పలుకరింపునకైన

పోతగదననంచు పొలతి! వినవె?



కం॥ నీతండ్రి కుత్సితంబులు

నీ తలకెక్కవు వినంగ నీకే మేలే

నీతిది ప్రేయసి! పిలువక

ప్రీతిగ పోరాదు యెట్టి పేరంటముకున్

వ॥ దానికి సతీదేవి ఇలా బదులిచ్చింది

కం॥ పని ఒత్తిడి అధికంబై

మనకాహ్వానంబు పంప మరచెనొయేమో

వినవా నాపై తండ్రికి

పెనవైచిన ప్రేమ నీవు ప్రియ! శంకేలా?

తే॥ అనుగు తోబుట్టువులు నాకు అమిత ప్రేమ

ఇత్తురదిగాక నాతల్లి ఎదురు జూచి

చిన్నబోవును, నా తండ్రి చింతనొందు

ముదిమి మరపును ఈయదే మెదడు వోయి



తే॥ మీరు రాకున్న నేబోదు మీ బదులుగ

నేను దక్షుని కూతును వేనినైన

లెక్కజేయను ఏ భీతి లేకనేను

అల్లునెందుకు మరచితి వని అడిగెద.

ఆ॥ మిమ్ము క్షమను వేడు మీ మామగారిని

మీరె నిలిచి శాంత పరతురపుడు

పనికి రానివైన పంతంబులకు బోయి

ముదము జార విడువ మూర్ఖతగును.

వ॥ దానికి శంకరుడంతటివాడు 'విధిని దప్పింప ఆ విధాతకు నైన సాధ్యము కాదని గ్రహించి ప్రియసతితో ఇట్లనెను.



ఆ॥ చిన్న బోవనేల చిన్నదానికి నింత

పోయి రమ్ము దేవి యుల్ల మలర

నేను రాను గాని నీ ఆస ద్రుంచుట

నాకు తగదు సుమ్మి నళిన నేత్రి!

కం॥ సంతస మన్నది సగమయి

ఎంతో యోచించి సతియు ఈ విధి బలికెన్

అంతా మనవారే ప్రభు!

ఇంతటి ఆలోచనేల ఈ విషయమునన్

వ॥ అని బలికిన సతీదేవి తోడుగ నందీశ్వరుని బంపి శంకరుడు ఆమెను తండ్రి వద్దకు బంపించెను.

తే॥ సంతసంబున కాలూనె సతియు దాను
పుట్టినింటను తోబుట్టువులను జూచి
కుశలమడుగంగ యొక్కతె కూడ తిరిగి
పలుకరించదు మోము ఆవలకు త్రిప్పి

ఆ॥ తండ్రి తనను జూచి తల ఆవలకు త్రిప్పె
యేహ్యాభావమంత నిమిడె కనుల
తల్లిమాట లాడ ధైర్యంబు జేకుండె
భాష్ప పూరితాయె పడతియంత

సీ॥ పనివారలైనను పల్లెత్తి మాటాడ
కుండిరి సతిజూచి కుశలమడుగ
బందుగు లందరు పలుకరించక త్రిక్కు
లను జూచు చుండిరి లజ్జచేత



చెలికత్తెలందరు చిన్నవోయిన జూపు
తోనుండిరన్నట్లు తోచెసతికి
ముక్కోటి దేవతల్ మొగములన్ వాల్చిరి
మూగవోయెను నోళ్ళుమూత పడెను

ఆ॥ కనుల నీరు జిమ్మ కాకలీ స్వరమున
అస్తమించు సూర్యుడట్టి అరుణ
నేత్రియైన జ్వలిత నెలతిట్లు తండ్రితో
ఛీత్కరించి బలికె సిగ్గు మరచి

ఆ॥ జగతి కారకుడిని జగముల పోషకున్
కించపరచ నీకు మంచికాదు
ధర్మమెరుగ నట్టి దక్ష ప్రజాపతి
అనబడెదవు తండ్రి అల్పుడవుచు



ఆ॥ జనకుడగుట చేత సహియించినన్ నేను
పెద్దలంత నిన్ను వెకిలి తిట్లు
తిట్టి పోతురయ్య ద్విజులును దివిజులున్
వక్రబుద్ధి వనుచు వసుధయందు

కం॥ జరిగినదేదో జరిగెను
పరమేశుని బిల్చి హవిర్ భాగము నిమ్మా
మరువక అల్లుని కొలువుము
జరుగును చెడు అట్లు గాక జనకా! నీకున్

వ॥ జ్వరము వచ్చిన వానికి మధురాన్నము చేదుగా దోచినట్లు దక్షునికా మాటలు వెగటై హుంకరించి ఆపై ఛీత్కరించి ఇట్లనెను.



సీ॥ మరుభూమి వాసుకున్ మనసిచ్చి చరియించ
దాక్షాయణని బిల్వ తగదు నిన్ను
తా రజోగుణముచే తాండవమాడును
యాగ భాగమునీయ అర్హుడగునె
ఆ దిగంబరునకు అపవిత్రుడౌ వాన్కి
అర్ధాంగిగ బ్రతుకు వ్యర్ధమెకద
పుర్రెలన్ చేబట్టు వెర్రికి తనువిచ్చి
పిచ్చిబట్టెను నిన్ను పిలిచెనెవడు?

తే॥ నిన్ను జూచిన పాపము నిలువ వలదు
ఇచట, పొమ్మింక లేనిచో ఇంతమంది
చూడగెంటింతు బయటకు మెడను బట్టి
నాకు నీవంటి కూతురు లేక నయము

వ॥ ఆ మాటలకు హృదయము జ్వలించి, చెవులనుండి అగ్నివంటి వాయువులు కంటినుండి కన్నీరు వర్షించు చుండగా ఆమె ఇట్లనెను.

కం॥ పతిమాట వినని నాతికి
గతి యిదియే యగును గాక కన్నీరొలకన్
వెతలొంది హీనురాలై
బ్రతుకుచు ఘోరంపు నింద బడునిది నిజమౌ

తే॥ తిరిగి పతికడ బోలేను, తెలివి లేక
చులకనయి నేను పతిమోము జూడలేను
నన్ను దాక్షాయణీ అననాకు వెగటు
కలుగుచున్నది ఈ బొంది కాలజేతు



వ॥ అని ఆమె పరమేశ్వరుని క్షమింపు మనియు మరు జన్మంబున పర్వత రాజు హిమవంతునికి పార్వతిగా జన్మించి తిరిగి భార్యనౌదునని యోగశక్తిచే అగ్ని జ్వాలలో క్షణకాలమున దగ్ధమై పోయెను. అదిజూచి నందీశ్వరాదులు హాహాకారములు చేయుచూ దక్షుని యాగశాలయందు ప్రవేశించుటకు ప్రయత్నించిరి. అంతట భృగు మహర్షి దక్షిణాగ్నియందు అభిసారికా హోమము చేసెను. అంతట

తే॥ నంది నిర్వీర్యుడైపోయి చెంది కలత
రుద్ర గణముల చేకొని భద్రతకును
పారిపోయెను, అశరీర వాణి పలికె
నీకు రోజులు మూడెను నీచ దక్ష!



ఆ॥ పరమ శివుని పత్ని మరణించ హేతుడౌ
నీచుడీవు క్షమయు నీకు లేదు
పోవుగాలమొచ్చి బుద్ధులు చెడె నీకు
పాప ఫలము కలుగు బ్రహ్మకైన

వ॥ నీకు సహకరించిన ఈ బ్రాహ్మణులును నశింతురు. ఆ మాటలు విన్న కొందరు బ్రాహ్మణు ఋషులూ నారదునితో సహా పారిపోయిరి.

తే॥ నంది కైలాసమును జేరి ఇందుధరుని
కాళ్ళపై బడి కన్నీరు కాల్వలవగ
జరుగు సంగతి వివరించ శంకరునకు
అరుణ జ్వలిత నేత్రుండయ్యె పరమ శివుడు



శా॥ క్రోధావేశము గట్లు ద్రెంచి యురికెన్
కోలాహలంబై మదిన్
బాధా తప్తుడు శూల పాణి యరిచెన్
భార్యా విచింతన్ తగన్
ఆధారుండు జగాలకెల్ల హరుడై వ్యాఘ్రుంబు,
గర్జించుచున్
బంధంబున్ సిగపాయనుండి పెరికెన్
వైచెన్ గిరిన్ యుగ్రుడై

వ॥ ఆ విధముగ పర్వతమున బడిన ఆ వేణినుండి మహా భీకరమైన వీర భద్రుడుదయించెను. నల్లని దేహముగల వానికి తెల్లని భయంకరమైన కోరలు రక్త వర్ణముగ పెద్ద పెద్ద కన్నులు, చాచిని పొడవాటి నాలుక, భీకరమైన కనుబొమ్మలు కలిగి చూచి నంతనే వెరపు కలుగు నట్లుండెను. అతని తోబుట్టువైన భద్రకాళి కోటి

సూర్యతేజో భాసురుడైన వీరభద్రునికి దీటుగా భయంకరముగ నుండెను. ఇట్లు జన్మించిన వెంటనే ఆతడు మహా దేవునికి సాష్టాంగ దండపు ప్రణామము జేసి ఇట్లనెను.

ఆ॥ తండ్రి! నేను బుట్ట తగిన కారణమేమి
నేను జేయదగిన పనదియేమి?
నాకు జెప్పవయ్య నశియింప జేతును
పుడమినెల్ల నీవు అడిగినంత

వ॥ ఆతనికి ముక్కంటి కర్కశుడై ఇట్లనెను

ఆ॥ వీరభద్ర! నిన్ను వెలయించితిని దక్ష
యజ్ఞ నాశనమును అమరజేయ
భద్రకాళి జతగ బడసి చేయుము దాని
నాదు శక్తులన్ని కుదురు నీకు



వ॥ పరమేశ్వర వర ప్రసాదియైన అతనిని ఏ బ్రాహ్మణ దివ్య శక్తియు ఏ దేవతా శౌర్య పరాక్రమములు, దక్ష ప్రజాపతి అప్రతిహత శాప ప్రభావము ఏమియూ జేయలేకుండెను. పరమ శివ దివ్య వరప్రసాదియైన ఆ వీరభద్రునికి వేయి భయంకర సింహములు పూన్చిన దివ్య రథము వాహనమయ్యెను. గజ, తురగ పదసేనలు మూడు కోట్లమంది శివ సేనకు సిద్ధమయ్యెను. ఆ రుద్ర గణములతోనూ, నందీశ్వర చండీశ్వర భైరవాది నాయకులతోను, భద్రకాళి జతయైన మహాకాళి, చాముండి, వైష్ణవి నవదుర్గ వంటి శక్తి గణములతోను, భేరీ, శంఖ, పటాహ, ఝల్లరి, కాహళీ, మృదంగ ఘంటా ఢమరుకాది దివ్య వాద్యములు భూమి కంపించునట్లు మ్రోగుచుండ దక్ష దమనమునకు వీరభద్రుడు బయలుదేరెను.



వ॥ ఇక ఆ వీర భద్రుని సేన వీరంగం చేస్తున్నప్పుడు ఇక్కడ దక్ష ప్రజాపతికి ఎన్నో దుశ్శకునములు ద్రోచినవి.

సీ॥ పరివేషములు బుట్టె ఆ రవి బింబాన
పగలె నక్షత్రాలు బయలు వెడలె
ఉల్కా పతనములున్ యుర్విపై బడసాగె
రక్త వర్షము పడెన్ లావుచెదర
పాములు తేళ్ళును క్రిమి కీటకాదుల
వానకురియసాగె వసుధ యందు
తెల్లని రంగుతో తేళ్ళు కన్పట్టెను
మిడుతల సేనలు దాడిచేసె

తే॥ వామ భాగము, నేత్రము వడిగ నదిరె
అగ్నిగుండము పొగబట్టె అక్షిద్వయము
మండె, దక్ష ప్రజాపతి గుండె చెదిరె
కీడు శంకించు చుండెను జడిసి యతడు



వ॥ అంతట, వివేకముగల దేవతలు, ఋషులు, ఋత్విక్కులు, బ్రాహ్మణులు, పురజనులు దక్షుని నిందించుచూ శివాపచారమునకు చెంపలు వాయించుకొనుచు అచటనుండి పారిపోయిరి. వీరభద్రుని సేన యాగశాల యందు ప్రవేశించి.

తే॥ పెక్కు విధముల బాధించి, వెరపు జెందు
దేవ ముని జన ఋత్విజ ద్విజుల కనెను
మీకు శాస్తిజేసితిమిట్లు మిడిసి పడుచు
దక్షయజ్ఞమునకు జేర శిక్ష యిదియె

తే॥ దక్షవదనము గాంచుచు తండ్రి శివుడు
కంటనీరిడి జెప్పుట కనులదోచి
పాపి శిరమును ఆ వీరభద్రుడపుడు
నరికి దక్షిణాగ్నిని వేసె వెరపు కలుగ

ఆ॥ చేతులెత్తి వేడు శివుని యత్త ప్రసూతి
కంటినీరు కారె కడలి వోలె
జాలిగొన్న యట్టి శంకర సూనియున్
ఆమె నొదలివైచె ఆడదనుచు

వ॥ ఆమెతో బాటు ఆమె కుమార్తెలు ప్రాణాలు దక్కించుకొని ఈశ్వరుని ప్రార్థించిరి. ఆ విధంబుగా దక్షయజ్ఞం ధ్వంసం జేసి యాగశాలను నాశనం చేసి యాగ సంబారములను నలు దిక్కులా విరజిమ్మి వీరభద్రుడు, భద్రకాళి, ఈశ్వర గణములతో కైలాసము జేరి వినమ్రులై నమస్కరించి నిలుచుండిరి. వీరభద్రునిచే భంగపడిన దేవతలు ఋషులు బ్రహ్మ వద్దకు జేరి మొరబెట్టుకొనిరి.

తే॥ నలువ, సురులకు మునులకు నచ్చజెప్పి
జేరి వైకుంఠపురము ఆ హరినిజూచి
దేవతల భంగపాటును దెలిపినంత
హరుని వేడుటే శరణని అతడు దెలిపె



వ॥ అచట కైలాసమున శ్రీనారాయణ అష్టాక్షరీ మంత్రమును పఠించుచూ పరబ్రహ్మ ధ్యానముననున్న ఆ సదాశివుడు కన్నులను దెరచి వారిని పలుకరించగా వారు పరమేశ్వరునికిట్లనిరి.

కం॥ ఆదివియునంత్యమీవై
నీదయచే జగములన్ని నిలుపుచు నీవే
వేదన జెందుట పాడియె?
కాదయ, ఇది తగదు నీకు కాలాంతకుడా!

సీ॥ చిన్న విత్తును నాట, శివలీలగాకున్న
పెను వృక్షమేరీతి వెలయుచుండె
పశువులు యేరీతి వని మేతకై బోయి
వెనుదిరిగింగ్లకు విధిగ జేరె
పక్షులు గూళ్ళలో వాని కూనలకెట్లు
గొప్పగ తిండిని గూర్పగలుగు
కంటగుర్తించక చంటి పాపడు యెట్లు
తల్లి స్తన్యము గ్రోలు తనివిదీర



తే॥ గ్రహము లెందుకు తప్పవు గతులు నింగి
కడలి దాటదు చెలియలి కట్టనేల?
స్వామి! నీవల్ల గాకున్న జరుగునేది
తగునె ముక్కంటి! కోపము, తగదు నీకు

సీ॥ లయ కారకుడ వీవె రవ్వంత యోచింపు
విధిని తప్పింపగ వేరికగును
సర్వసముడవీవె సంసార కర్తవు
ప్రకృతి మాయన జూడు బాధ వలదు
అరిషడ్గుణంబులన్ అవలీల వంచెడి
నిత్య సంతోషివి నిశ్చలుడవు
దక్ష యజ్ఞంబునతడు పూర్తి చేయక
యుర్వి అనావృష్టి యుతముగాదె



తే॥ జనులు తిండికై అల్లాడి చత్తురయ్య!
తప్పుచేసిన దొకరైన దండనొందు
వేరొకరుయన్న రీతియౌ వినుము మనవి
జగతి కాపాడుమో ప్రభూ! నిగమ వినుత!

ఆ॥ దక్షుడెంతొ నీకు తప్పిదమునుజేసె
ఘోర మరణమొందె గొలువుబోయె
తిరిగి జీవమిచ్చి కరుణింపుమిక వాని
జరుగకున్న సృష్టి జగతికెట్లు?

ఉ॥ ఈ మహి పుట్టుకైన ఘనులెందరొ జావును
బొందలేదె మున్
నామనవింక దాల్చుమయ నాణ్యత కాదిది
దుఃఖమొందగా

ఓ మహనీయ! కోపమది ఒక్క నిమేషము
గొప్పవారికిన్
నీమది శాంతి నిల్వయిక నిశ్చలుడై తప
మాచరించుమా

వ॥ ఆ మాటలకు పరమేశ్వరుడు సంతోషించి దక్షునికి ప్రాణదానం చేయుటకు నిశ్చయించెను. కాని వీరభద్రునిచే నరికి వేయబడిన అతని తల అగ్నిలో కాలిపోయి లభించలేదు. అప్పుడు పరమేశ్వరుడు వీరభద్రునితో ఇలా అన్నాడు.

తే॥ మీరు ఉత్తర దిక్కుగా శిరసునుంచి
తాను నిద్రించు జీవిని తలను నరికి
ఇచట గొనితెండు దానిని ఇతని మొండె
మునకు అతికించినే జీవములను ఇత్తు



కం॥ వెతుకగ బోయెను అప్పుడు
అతనికి కనిపించె గొర్రె ఆదమరచుచున్
మతిలేక ఉత్తర దిశను
స్థితమై తలబెట్టి నిదుర చెందెడి దానిన్

వ॥ శివుని ఆజ్ఞానుసారము ఆ తలనరికి దెచ్చి ఇచ్చెను. శంకరుడు దానిని దక్షుని మొండెమునకు అతికించి బ్రహ్మచే ప్రాణము పోయించి ఆ దక్షుని యాగమును పూర్తి చేయించెను. దేవతలు, మునులు, ప్రజలు సంతోషించి శివుని కీర్తించిరి. దక్షుడు శివుని కాళ్ళపై బడి కన్నీటితో ఇలా అన్నాడు.



చం॥ మదమతి ఘోరమైన రుజ, మాన్యుల నందరి
మన్నుజేయుచున్
చెదలను బట్టజేయు మతి, జీవుల బాధల
మూలకారణం
బది తను మోహలోభముల కాదియు పెంచును
కామక్రోధముల్
ఇది శివ! నీదులీలయని ఇంగిత మన్నది
లేక దూరితిన్

వ॥ పశ్చాత్తాప దగ్ధుడవుతున్న దక్ష ప్రజాపతిని జూచి పరమశివుడు ఈ విధంగా అన్నాడు.

ఆ॥ నీవు జెప్పుమాట నిజమయ్య ఓ దక్ష!
కోపమణచలేని కోవిదుడను
బ్రహ్మ 'సృష్ఠి' జేయు వర ప్రజాపతి వీవు
మామ జంప మంటి మతి నశించి



తే॥ అత్త మాంగల్యమును ద్రెంచు అధముడెవడు
యాగ ధ్వంసము జేయించు అల్లుడెవడు
భార్య మరణించ యేడ్చెడి బడుగెవండు
ఈశ్వరునికైన మోహము హీనగుణము

వ॥ ఓ దక్ష ప్రజాపతీ! అందుకే ఆర్యులు "ప్రమాదో ధీమతామపి" అన్నారు. అనగా ఒక్కొక్కప్పుడు ఎంత బుద్ధిమంతులైన పొరబాట్లు చేస్తారు.

తే॥ కారణములేక కార్యము కలుగబోదు
దలచి ఆర్యోక్తి ఎవ్వరు నిలుతురిలను
దుఃఖమెన్నడున్ గలుగదు తొలుగు భయము
సుఖములందెద రవ్వారు సూక్తి నిజము

వ॥ అయినదేదో అయినది నీకు కలిగిన బాధకు పరి
హారముగా ఏదియైన వరము కోరుకొనుము తీర్చెదను
అని చెప్పెను. దానికి దక్షుడిలా అన్నాడు.

ఆ॥ తెగి పడినది నాదు తెలివి లేని శిరంబు
గొఱ్ఱె తలయె మేలు కూడె మతియు
దక్ష వాటికనచు ధర బిల్వబడుగాక
ఈ స్థలమిది పేరు యెనయు గాక

వ॥ దానికి పరమేశ్వరుడంగీకరించెను. ఈశ్వరుడు
వీరభద్రుని జూచి ఇట్లనెను.

ఆ॥ అలరుమీ స్థలికిని ఆగ్నేయ దిక్కున
గౌతమీ తటమున ఘనత జెంద
వీరభద్ర నీవువెలసి గణములతో
దక్ష వాటికకును రక్షనిమ్ము



ఆ॥ ఈ శివగణములును ఇకపైన నీవారు
దుష్ట సంఘములను దునుము మిచట
నిన్ను గెలుచువాడు ఎన్నడు కనరాదు
నీవె వేల్పు విచట నీవె రక్ష

వ॥ ఆ తరువాత ఎవ్వరి నివాసములకు వారేగిన పిదప
పరమ శివుడు వైరాగ్యముతో సతీదేవి చితాభస్మము
ధరించి పరబ్రహ్మమును ధ్యానించుచూ కైలాస
పర్వతముపై తపంబొనరించసాగెను.

కం॥ 'సతి' లేక బ్రతుకు వేదన
సతివీడిన, శివుడెరుంగు సజ్జనులారా
సతిపతి దలచుచు గడిపిన
సతతము మిముగాచు హరుడు సాయంబవుగా



# గిరిజా కళ్యాణం

వ॥ సతీదేవి తిరిగి పార్వతిగా జన్మించి పరమ శివుని పెండ్లాడి
జగత్కళ్యాణము జరిపిన కథ జెప్పెదను ఆలకింపుడు.

కం॥ నగముల హిమవంతంబని
అగణితమగు ఖ్యాతిగాంచె అతనికి సుతగా
భగవంతుడైన ధూర్జటి
సగదేహం బొంద గిరిజ జన్మించెనిలన్

ఆ॥ నదుల పుట్టినిల్లు నగరాజమయ్యెది
రత్న రాసులచటె లబ్ధియౌను
వృక్షరాజములకు పెన్నిధియైనదే
తాపసులకు మోక్ష ధామమయ్యె



తే॥ దేవగణముల వాసమౌ భువిని జేర
యాగములు జేయ శ్రేష్టంబు అయిన తావు
పితృ దేవతలెంచిన ప్రియ నెలవది
సతికి జన్మకై యెంచిన జనకుడతడె

వ॥ దక్ష ప్రజాపతి సంతానమైన స్వధ, తండ్రి నిర్ణయించిన
పితృదేవతలను పరిణయమాడెను. వారికి మేన, ధన్య,
కళావతి అను ముగ్గురు సౌందర్య దేవతలా
అనిపించునట్టి పుత్రికలు జన్మించిరి. వారు సౌశీల్యురై,
జ్ఞానులై, యోగినులై అన్ని లోకములు తిరుగు
శక్తిగలవారలై యథేచ్ఛగా సంచరించుచుండిరి.
దురదృష్టవశమున వారు సనకసనందులను జూచి
ఒకనాడు గౌరవముగా నమస్కరించుట మఱచిరి. దానికి
తీవ్రంగా ఆగ్రహించి

కం॥ తెంపరి తనమునను తపో
సంపన్నుల నరసికూడ సవినయమొప్పన్
ఇంపుగ నిలువక నుంటిరి
కొంపోవరె శాపఫలము కూడగ మిమ్మున్

తే॥ పుడమి జన్మించి పురుషులు కూడుచుండ
పురుటి నొప్పుల కోర్చుచు పొంది సంతు
మీరు నివసించెదరు గాక దీరపొగరు
అనగ వలవల రోదించి అతివలనిరి

వ॥ మహాత్మా! మేము త్రిలోక సంచారినుల మవుటచే అలసి విశ్రాంతి పొందుచు మిమ్ము జూడకుంటిమి. ఇంత చిన్న తప్పుకు అంత శిక్ష తగునా. మాకు మార్గాంతరము దెల్పి రక్షింపుడనగా, కన్యలారా! మా శాపము కూడా మీకు వరము వలె జగత్కళ్యాణము జరుగుటకు నాంది బల్లి, మీ ముప్వురకు అతి ప్రసిద్ధి జెందు పుత్రికలకు తల్లులగు అదృష్టము కలుగును అని పలికిరి.

కం॥ మేనా శివునికి అత్తగు
తానా సీతమ్మబెంచు ధన్యయు ఆపై
ఈనాతి మీ కళావతి
చానను ఆ రాధ గనను జత కృష్ణునికొ



వ॥ కృతయుగంలో హిమవంతునివలన మేనా జగన్మాత పార్వతిని గనును. త్రేతాయుగంబున జనకుని పెండ్లాడి ధన్య మహాలక్ష్మి అంశాన సీతను శ్రీరామపత్ని యగుటకు కనును. ద్వాపర యుగంబున కళావతి వృషభుని పరిణయమాడి గోలోక నాయకి యైన రాధను శ్రీకృష్ణుని కొరకుగని తరించును. మూడు యుగములందును లోక కళ్యాణమునకు మీరు మూలమగుదురు అని జెప్పి వెడలిపోయిరి.

తే॥ మేనా హిమవంతుడు పెండ్లియాడె
సురతులను దేలి వారలు సుఖమునుండ
బ్రహ్మ విష్ణు దేవేంద్రులు వాని దరికి
వచ్చిరింపుగా బలికిరి వాని కపుడు

వ॥ ఓ హిమవంతా! దక్షయజ్ఞమున తనువు త్యజించిన శివుని అర్ధాంగి సతీదేవి నీకు పుత్రికయై జన్మించును. పార్వతిగా పిలువబడు ఆ దేవి పరమశివుని జేబట్టి నీకు అల్లునిజేసి నీజన్మ పావనము జేయునున్నది.



తే॥ సుత శతంబౌను హిమవంత జతవుగీర్తి
లోకమాతయే స్వయముగా నీకు పాప
ఏమి పుణ్యము జేసితివీవు తొల్ల
మెప్పు పొందుము దేవిని గొలువరయ్య

వ॥ వారు దేవిని భక్తితో నిష్ఠతో తపస్సుచే గొలువ సాగిరి.

తే॥ జగము లేలెడి పరదేవి జగతిమాత
మాయలోముంచి ఆడించు మాతవీవు
వేదమాతవు కరుణింప వేడుకొందు
మమ్ము దర్శనమీయవే అవనిగావ

వ॥ అంత త్రిమూర్తులకు దేవేంద్రాది దేవతలకు గల పెక్కు ఆయుధములను ధరించి, దివ్యవస్త్రాభరణ భూషితయై త్రినేత్రియైన పరాశక్తి వారికి దర్శనమొసగెను.



ఆ॥ దక్షయజ్ఞమందు తల్లి! మంటను జేరి
తనువు వీడినావు ధవుని జతను
శివుడు తాపసయ్యె చింతలోనున్నాడు
స్వామి గూడుమమ్మ జగములేల

కం॥ తారకుడను దనుంజుడును
భారంబై జగములన్ని బాధించెనుగా
ఆ రాక్షసుండు జావక
చేరదు కనులందు కునుకు చింతతొ తల్లీ!

వ॥ నీవు మేనా హిమవంతులకు పార్వతిగా జన్మించి ఇప్పుడు తపో నిష్ఠలోనున్న పరమశివుని పెండ్లాడిన గాని తారకుని సంహరించగల బుత్రుడు నీకు గలుగడు. నీకుమారుడే లోకకంటకుడైన తారకుని వధించ గలడు. ఇందులకు దేవి అంగీకరించెను.

తే॥ నెరపె తపమును భార్యతో గిరుల రాజు
దేవి వరముల నిచ్చెను దీవెనలను
ఆమె పుత్రిక యౌనను ఆశచేత
వరములేవియు వారలు వద్దననిరి

ఆ॥ సుతశతంబు నిచ్చె అతి ప్రీతితో దేవి
వారి బొంది పిదప గిరిజ కొరకు
వేయి కళ్ళతోటి వీక్షించ ఆ దేవి
పాప వోలె బుట్టె పార్వతాయె.

వ॥ పరదేవత కరుణ వలన మేనా, ఆరుద్రా నక్షత్రయుక్త చైత్ర శుద్ధ నవమినాడు శుభ ఘడియలలో ముద్దు లొలుకు పాపగా దేవిని ప్రసవించెను. హిమవంతుడు మిక్కిలి సంతోషముతో బ్రాహ్మణులకు భూ, గో, సువర్ణ దానములిచ్చాడు.

కం॥ నీలోత్పల సన్నిభమగు
బాలామణి దేహకాంతి, బలికిరి ద్విజులున్
మేలుగ పార్వతి ఈమెయె
శూలిని బెండ్లాడు, యేలుశుభముగ జగముల్

తే॥ మనసు ఆనంద డోలిక తాను ఊగ
మేనా ప్రీతితో చెలులకు మితములేని
కానుకలు నిచ్చె, బాలిక దినము కొకటి
కళలు తోపగ పెరిగెను కనులు పండ



వ॥ జగజ్జననియైనా జన్మ నొందిన తరువాత ఆ జన్మ కనుగుణంబైన రాగబంధములు, కామక్రోధములు సుఖదుఃఖముల ననుభవించక తప్పదు. ఈ జగన్నాటకమున పాత్రధారికాక తప్పదు.

ఆ॥ బాల్య క్రీడలందు పావని మురియుచు
మరువ జేసె కాలమెరుకలేక
తాను సతినటంచు తరళాక్షి గుర్తొచ్చి
పతిని తలచి యామె వంతనుండు

సీ॥ సింహంబు జూచిన చిన్నారి వెరువదు
చెవిబట్టి యాడించు చెలులు బెదర
హిమగిరి గుహలందు, యిసుకతిన్నెలయందు
దాగుడుమూతలు తాను ఆడు
పూబంతి ద్రిప్పుచు భువిని సైతము నేను
ద్రిప్పుచున్నానని తేల్చి జెప్పు
బొమ్మరిండ్లను గట్టి పూని కాళ్ళతొ ద్రొక్కి
నిలిపేది కూల్చేది నేనె యనును



తే॥ విద్యలన్నియు నేర్చెను వింతగొలుప
చిత్రలేఖన నేర్చెను శివుని గీసె
సామగానము పాడును సంతసమున
నే శివానిని అని జెప్పు నెలతలకును

వ॥ పార్వతి యుక్తవయస్సురాలైనది. ఆమె ఆటపాటలలో కాలం స్వప్నంలా గడచిపోయినది. ఆమె తను పుత్రికయను భ్రమలో మునిగి హిమవంతుడు, మేనా పుత్రిక వివాహమునకై తగిన వరుని గురించిన చింతలోనుండిరి. ఆమె తమకు బుట్టిన కారణమునే మరచిరి. ఇంతలో ఒకరోజు

ఆ॥ నారదుండు వచ్చి నగరాజు జూచిన
మునిని అడిగె రాజు ఘనత గొలిచి
సర్వ లక్షణముల చరియించు తనుపుత్రి
కెవరు పతిగ తగును ఎరుక జెప్ప

వ॥ పార్వతిని పిలిపించి మునికి నమస్కరింప జేసిన ఆమె వామహస్తమును జూచి



ఆ॥ జగతికీమె జనని జగదీశ్వరుని రాణి
నీదు భాగ్యమలర నీకు బుట్టె
శివుడు అల్లుడవగ జేయును ఈ దేవి
సర్వ మంగళయగు సానుశ్రేష్ఠ!

ఆ॥ మౌని చనిన పిదప తనభార్య నడుగగా
జ్ఞప్తికొచ్చె గతము సర్వమున్ను
పాపకాదు ఈమె పావని యనియంచు
హిమనగేశుడెరిగె నింగితంబు

కం॥ సకలము నెరిగియు మరచితి
ఇక ధూర్జటి నీమె పతిగ యేర్పడ జేతున్
యొకసుంతజాగు చేయను
అకళంకిత ఉమను శివునికర్పణ జేతున్

ఉ॥ వీడెను రాగ ద్వేషములు వేల్పుల వేల్పగు
విశ్వనాథుడున్
వీడుచు సంగమున్ జగతి భిక్షువు
ఘోరతపమ్మునుండె, తాన్
జాడ నెరుంగలేనిదగు సానువునందున
ఆత్మజ్ఞానియై
మూడు జగాల దేవతలు ముందర జేరరు
భీతి జెందగన్

వ॥ ఓ పుత్రీ పార్వతీ! అట్టి పరమ శివుని మెప్పించు విధము ఆ స్వామిని గూర్చి తపంబొక్కటియే నీవు ఇక దీక్షతో నీ మనోరథం నెరవేరుటకై ఆ త్రినేత్రుని కొరకు తపము నాచరించుము అని జెప్పెను.

వ॥ నారదుడు వచ్చిన పని నెరవేరినందుకు సంతోషించి తనదారినతను బోయెను.



వ॥ పరమ శివుడు కైలాస పర్వతమున ఒంటిగా శైవగణములను వీరభద్రుని కోసం విరాగియై పరబ్రహ్మను గూర్చి తపంబు జేయుచు యుండెను. ఈ వార్తను దూతల వల్ల విన్న హిమవంతుడు మిక్కిలి సంతసించి ముక్కంటిని పరామర్శించుటకు సతీ సమేతుడై వెడలెను. ఆయన శివునితో

తే॥ మేము జేసిన పుణ్యము మీరు యిచట
జేరి తపమును ఒంటిగా చేయుచుంట
మా సుపుత్రిక పార్వతి మాకు బదులు
మిమ్ము గొలుచుచు సాయము మీకు జేయు

కం॥ జంకుచు బదులిడెనంతట
శంకరుడా రాజుజూచి సవ్యంబగునే
వంకలు బెట్టరె జనులును
సంకట మెందులకు నాకు సాగదు తపమున్

వ॥ దానికి హిమవంతు డంగీకరించక ఇట్లనెను



తే॥ నీవు జగతికి విభుడవు నీకు పూజ
చేసి పరిచర్యలను మీకు జేయతగమె
బాల చెలియలతో జేరి కొలుచు మిమ్ము
శంక వీడుము శంకరా వంకలేల?

వ॥ ఎట్టకేలకు శంకరుడు వల్లె అనెను. హిమవంతుడు పార్వతిని బిలిచి పరమశివునికి ప్రణమిల్లజేసి ఆశీస్సులను గైకొన జేసెను.

ఆ॥ పుత్రి! నీవుజేయు పుణ్యంబదేమొకో
పరమ శివుని గొలుచు భాగ్యమబ్బె
జాగరూకతయును శ్రద్ధను జూపించి
పేరు నిలుపుమమ్మ పిన్నవైన

తే॥ పగలు రెండు యాములు వేళ పరమ శివుని
పూజ కొరకామె యిచ్చును పుష్పములను
భక్తి గొలుచును అందించు ఫలములన్ని
చెప్పి సెలవా నగపు పుత్రి చేరె నెలవు

వ॥ అటు పిమ్మట పార్వతి ప్రతిదినము ఈశ్వరుని భక్తితో సేవించు చుండెను.



ఆ॥ బ్రహ్మ వలన నెరిగి పాకారి యొకనాడు
మదను జూచి కోరె, మాకు సాయ
మగుము నీవు, శివుడు నగరాజ తనయను
గూడవలెను ఆమె కొడుకు నంద

తే॥ పంచ బాణుడు శివహాని వలదననియె
కాని జగముల వేదన కారకుండు
తారకాసురుడంతము దాను జెందు
గిరిజ సుతునితోనని నేర్చి శిరము నూపె

వ॥ నేను మన్మథుడను. నా భార్య రతితో గలిసి నా పంచ బాణములతో స్త్రీ, పురుషులను సమ్మోహింప జేయగలను. అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము అను ఐదు పూ బాణముల నుపయోగించి నెమ్మదిగా వారి కామ తీవ్రతను పెంచి వివశులను జేయగలను. నా చెఱకు వింటినుండి వెలువడు సమ్మోహనాస్త్రములను తట్టుకొనుట చాల కష్టము.

కం॥ సతిపతి రతులను దేలగ
మితిలేకయె పెరుగుచుంద్రు మేదిని జీవుల్
అతి నీచమంచు దోచియు
కుతితో స్త్రీ ననుభవించ కూడుదురు జనుల్

కం॥ ఈశ్వరుడైనా ఆ జగ
దీశ్వరుడునుగాని కామమెక్కిన తానా
అశ్వము వలె బడి స్త్రీపై
శాశ్వతముగ బానిసౌను సంతుయు బెరుగున్

వ॥ ఈ వరము నాకు సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే ఇచ్చాడు. తగిన సమయమున నేను తగిన విధమున ముక్కంటి పార్వతిని వలచునట్లు జేసి లోక కళ్యాణమునకు నావంతు కృషి చేస్తాను. నీవు నిశ్చింతగా వెళ్ళి రమ్ము అని దేవేంద్రుని మన్మధుడు సాగనంపినాడు. అటు పిమ్మట పార్వతీదేవి చెలికత్తెలతో గూడి సరసోక్తులాడుచు శివుడు అర్ధనిమీలిత నేత్రుండై



మారేడు చెట్లుగల వనమున యున్న చెట్టు క్రింద కూర్చుండుట జూచి మదనుడు కూడా అక్కడ జేరి వేచియుండెను.

ఉ॥ శైలజ వచ్చెనంత తను సాయ సపర్యలు
విశ్వనాధుకున్
బాలిక పుష్ప గుచ్ఛమును వందన పూర్వక
మట్లు నీయగా
వీలును జూచివైచె నరవిందము కిమ్మనకుండె
ఈశుడున్
ఆ లలితాంగి బొందె తను ఆయెడ స్త్రీ వలె
కామచింతనల్

వ॥ అప్పుడు మన్మధుడు అచ్చెరువంది తన పూవింటితో అశోకము, చూతము, నవమల్లిక అను మూడు కుసుమ శరములను వైచెను. గిరినందన వేదన చెందుతున్నది కాని నీలకంతుని కేమియు గాకున్నది. ఆశ్చర్యము విచారము పెనచిన భావజుడు తడబడి చివరి ప్రయత్నముగా



కం॥ నీలోత్పలమును మదనుడు
కోలకు సంధించి శివుని గొట్టెను అపుడా
శైలజ పైయొక లిప్తలొ
నీలగ్రీవుండు బాసె నిగ్రహమంతన్

వ॥ వెంటనే కోలుకుని భీకరముగ హూంకరించి నిట లాక్షుడు తన మూడవ కన్ను తెరచి రెప్పపాటులో మన్మధుని సహితముగా ఆ మారేడు వనమునే భస్మము జేసెను. ఇది జూచి దేవేంద్రాదులు హాహా కారములు చేసిరి. మన్మధుని భార్య రతీదేవి రోదించుచూ వచ్చెను.

ఆ॥ వలవలనుచు యేడ్చు అలివేణి యరుదెంచె
దేవ దేవ! కోర దివిజ వరులు
నిన్ను గిరిజ గూర్చ నివురాయె నాపతి
తప్పు ఒరులు జేయ ముప్పు నాక?



తే॥ ఆమె నోదార్చి ముక్కంటి అనెను ఇట్లు
తాను అశరీరుడై జేయు తనకు నలువ
ఇచ్చినట్టి కర్తవ్యంబు, ఇంతి! నీకు
మాత్రమాతడు రూపుతో మరులు దీర్చు

వ॥ ఇట్లు జెప్పగా ఆమె సంతోషించి పరమేశ్వరునికి ప్రణమిల్లి స్వర్గంబున దొల్లి తమకు దేవేంద్రుడొసగిన భవనంబునకు బోయెను.

కం॥ ఇంతలు జరిగిన పిమ్మట
ఇంతిని కాదనగరాదు ఈశుడు దలచెన్
చింతించె సర్వమంగళ
సంతోషము గూర్పగలదు సతివలె తొల్లిన్

వ॥ అట్లు దలచి తగు సమయమునకు వేచి యుండెను.

ఆ॥ గిరిజ భీతిజెంది గేహంబునకు బోయె
విన్నవించె జరుగు వివరమంత
ఊరడిల్లజేసి గిరిరాజు పత్నితో
జేయ దగినదేమి చింతనుండె

కం॥ జరిగినది జరుగుచున్నది
జరుగును ముందేది దెలియు సవివరముగ, తా
నెరిగిన నారదమునియట
కరిగెను హిమవంతు జెంత ఆ తరుణమునన్

వ॥ ఓ హిమవంతా! చింతించకు

కం॥ నొప్పుల కోర్వక ఏడ్వక
ఎప్పటికిని బిడ్డ గనదు ఇంతియు భువిలో
అప్పరమేశుడు అల్లుడు
గొప్పగ నీకెట్లు గూడు కూరిమిదెచ్చున్?



వ॥ నీపుత్రి పరమేశ్వరుని జేపట్లు సమయమాసన్న మయినది. శివ పంచాక్షరీ మహామంత్రమును ఆమెకు ఉపదేసించెదను అని శైలజకు ఆ మంత్రమును జెప్పెను.

ఆ॥ జూపగలుగు శివుని ఓ పార్వతీ! యిది
బ్రహ్మహత్య గూర్పు పాపమాపు
దీని జపము నీకు యొనగూర్చు శంభుని
చింతమాని సలుపు శివుని తపము.

వ॥ అనిజెప్పి నారదుడు వెడలిపోయెను. శివ పంచాక్షరీ మంత్రమును ఉపదేశము నొందిన శైలజ వెంటనే తలిదండ్రుల అనుమతి బొంది కృతకృత్యురాలయ్యెను.

వ॥ అని దలంచి తగు సమయమునకు వేచియుండెను.



సీ॥ నార చీరెలు గట్టె నారీ శిరోమణి
ఆభరణంబులు అతివ వీడె
మౌంజి బంధంబును మానిని బిగియించె
జింక చర్మము జుట్టె చిన్నదియును
జయ విజయలు అనే సహచర బాలికల్
శృంగ తీర్థమునకు జతగ రాగ
స్థితమౌచు యొకచోట స్థిర చిత్తమున బాల
పద్మాసనై గొల్చె పరమశివుని

తే॥ పంచఅక్షర మంత్ర జపంబు జేసె
పార్వతిని జూచి ఆశ్చర్యపడిరి సఖులు
వదలె నాహారములను తపంబు బూనె
పర్ణమైనను దినక అపర్ణ అయ్యె

వ॥ ఒకనాడు ఆమెను జూడవచ్చి హిమవంతుని కుటుంబము ఆమెను జూచి కన్నీరు గార్చుచు.



కం॥ ఇంతటి వేదనమేలా?
ఎంతని ముక్కంటి గొల్తువిక చాలమ్మా
ఇంతిరొ! మా మాటలు విను
చింతను ఆ శివుని గూర్చి చేయకు నగజా!

వ॥ కాని ఆమె పంతము వీడక సదాశివుని కరుణ పొందేవరకు తను కదలననెను. వారు నిరాశతో వెడలిపోయిరి. ఇక్కడ కైలాసమున దేవేంద్రుడు, బ్రహ్మ, విష్ణులు శంకరుని జూచి వందనమాచరించి ఇట్లనిరి.

ఆ॥ సర్వమెరుగు దీవు, జగతి కంటకుడైన
తారకాసురునికి మరణమీయ
వాడు, నీవుగూడ పార్వతిన్, జన్మించు
లోక హితము జూడ నీకు గాదె?

వ॥ దానికి సదా శివుడు మీరు జెప్పునది నిజమే, కాని నా తపస్సు సాగదు. భార్యాలంపటము బాధాకరము గదా పైగా

కం॥ నేమనసిజుని దహించితి
నీమము చెరిచాడటంచు, నేటికి నేనే
ఆ ముదిత కొఱకు బూనిన
కాముని జంపంగ నేల కాముకుడనరే?

వ॥ దానికి జనార్ధనుడు నవ్వి ఓ మహేశ్వరా! నిన్ను కాదనువాడెవడు. పైగా

కం॥ విదురుని సభ బూజించరు
ముదితను బెండ్లాడువాని ముజ్జగములలో
మదిగొని గౌరవమిత్తురు
ఇది నీవెరుగవ మహేశ! ఇంతిని గొనుమా



ఆ॥ నన్ను మించి సిరులు నాయాలికున్నవి
వాణి విద్యలందు బ్రహ్మమించు
ఎవరు అధికులైన ఏ భేదముందయా
నాతిలేని బ్రతుకు నరక సమము.

వ॥ ఇదిగాక నీ భక్తుడు తారకాసురుడు లోక కంటకుడై లోకములను, సజ్జనులను వేదించుచున్నాడు. వాడు నీ ఆత్మలింగము బొంది వరప్రభావమున చెలరేగాడు.

కం॥ నీ వీర్య జనితుడొకడే
తావధియించంగ జాలు తారకునిలలో
నీవా పార్వతి గూడిన
నీవారసుడొచ్చి జంపు నీచుని విసుమా.

తే॥ నిన్ను బాసిన నీ సతి నేడు జన్మ
నొంది హిమగిరి బాలయై పొంద నిన్ను
తపము జేయుచు వేచె నీదయను గోరి
గిరిజ కళ్యాణమిక జాగు జరుపనేల?



వ॥ దానికి చిరునవ్వుతో వ్యోమకేశుడు వల్లె అని అంగీకరించి వారిని పంపివైచి

ఆ॥ సప్త ఋషుల బిల్చి సహకరించగ గోరె
పరమ శివుడు అంత పార్వతి కడ
బోయి ఆమె స్థిరపు వుల్లంబు నెరుగంగ
గోర వారు జనిరి గిరిజ కడకు.

వ॥ ఆమె వారినాదరించి పాదాభివందనం బొనరించి మహాత్ములారా మీ దర్శన భాగ్యం కలిగి నేను ధన్యనయ్యాను. నేను మీకు ఏమి జేయగల దానను అని అడిగింది.

ఆ॥ తల్లి! నీవు ఇట్లు తనువు కృశించగ
తపము జేయనేల తగదు వినుము
రాచ బిడ్డవమ్మ రాణిగా జీవించు
'బూది' వానిగోర బుద్ధి కరువె?



వ॥ ఆమె కోపమును బలవంతాన దిగమ్రింగి పైకి ఇట్లనెను.

ఆ॥ బ్రహ్మ కోరబుట్టి వ్యర్థ ప్రలాపన
తగదు మీకు వేగ తరలి పొందు
శివుని దక్క నేను జేపట్ట నన్యుని
జన్మ పోయి తిరిగి జన్మమైన

వ॥ వారు ఎంతో సంతోషించి అభీష్ఠ సిద్ధిరస్తు అని ఆశీర్వదించి వెడలిపోయిరి.

కం॥ ఇష్ట జనులకు తనన్నను
ఇష్టము తానెరుగ గోరు ఈశ్వరుడెపుడున్
నష్టము జేసి పరీక్షలు
కష్టములిచ్చును. మరెన్నొ కన్నీళ్ళిచ్చున్.

వ॥ ఆ పరాత్పరుడి తత్వం అంతే. ఆయనే కావాలంటే అగచాట్లు, నిరాశ, తప్పవు. ఆయనకి మన ప్రేమపై నమ్మకం కలుగనిదే ఆయన దిగిరాడు. యుగాలెన్ని అయినా అంతే.

ఆ॥ వచ్చి గిరిజ జూడ పశుపతి ఆకడ
పండు ముదుసలయ్యె పలుకరించె
దివ్య అనుభవమును దేవి బొందుచు గొల్వ
తపము చేసెదేల తరుణి అనెను

తే॥ అతని తేజము జూచిన అద్రి తనయ
వినయ మొప్పగ తనయొక్క వివరములను
తానెరింగించె, పకపక 'తాత' నవ్వి
పలికెనీ రీతి గిరిరాజ బాలకపుడు

ఉ॥ ఎవ్వతె వీవు? తాపసిగ ఇట్లు హిమాచల
మందు జేరుచున్
జివ్వున రక్తమున్ బిగియ జేసెడి తావున
ఒంటి దానవై
సవ్వడిలేక ధీరులకు సైతము భీతిని
గొల్పు చోట నీ
వెవ్వరికై అపర్ణవయి ఈవిధి అందము గాల్చుచుంటివే



వ॥ పార్వతి ఆముదుసలికి తన పూర్వజన్మ వృత్తాంతము, హిమవంతునికి తిరిగి పుత్రికగా జన్మించుట, శివుని గొలుచుట, మన్మధుని దుదుకుపని, కామదహనం శివుడు కైలాసమునకు తిరిగి పోవుట, నారదుడు వచ్చి శివపంచాక్షరీ మంత్రము బోధించి, తపమును దీక్షగా ఆచరించమనుట, తెలిపి, నేను పరమ శివుని గూర్చి ఆయనను పెండ్లియాడ తపంబు నాచరించు చుంటిని అని జెప్పెను. దానికా ముదుసలి పెద్దగా నవ్వి ఇట్లనెను.

ఆ॥ ఇంత సుందరాంగి ఎంతటి అవివేకి
నేను తెలియకుంటి నీరజాక్షి!
కోతికిచ్చినట్టి కొబ్బరి కాయగు
మీదు జంట జూడ మేటి జంట!



సీ॥ సయ్యాటలాడుచో సర్ప రాజులు నిన్ను
బుస్సని బెదిరించు ఉలికి పడగ
ముద్దాడు వేళలో ఎద్దు మీవారిని
రంకేసి బిలుచును రమ్మనంచు
కౌగిలించిన వేళ కాయాన బులిమిన
బూడిద అంటును ఉవిద నీకు
పతినిన్ను కూడుచో హితుడైన చంద్రుండు
నెత్తిపై నవ్వుచు నిన్ను జూచు

ఆ॥ వ్యాఘ్ర చర్మ మరసి భామిని బెదరకు
పట్టుబట్ట యదియె పతికి గట్ట
ఇంత సొగసు జంట ఏచోట జూడను
కోటి కొకరు కలుగు కూడి వెదుక



చం॥ నుదుటను కన్నువాడు నిను నూతన
భార్యన బూదిజేయునో
అదరక మామ జంపినది అల్లరి మూకతొ
ఆతడేకదా
కుదురును లేదు వేదములకూడి పఠించడు
నిష్ఠలేదు నీ
మది తననేల తల్చెదవు? మానుము, అన్యుని
బెండ్లియాడుమా

వ॥ ఆమాటలు విన్న అపర్ణ ఆగ్రహోదగ్రయై తొల్లి తను జూపిన వినయము గౌరవము విడనాడి ఆ సన్యాసి కిట్లనెను.

ఆ॥ కపట యతివి నీవు కదు ధూర్తుదవు నీవు
శివుని యెరుగలేని చెనటి వీవు
శివుని దూషణంబు చేగూర్చు ఏడేడు
జన్మములకు 'లేమి' చదువలేదే?

కం॥ మెడబట్టి గెంటుడిపుడే
కడు దుష్టుడు నీచుడితడు కపటియు ఇపుడీ
తడవున, పాపము కాదిది
చెడు మాటల ప్రోవు ఇతడు శివద్వేషియునున్

వ॥ కోపం తాళలేక గిరిజ చెలికత్తెలకు ఆ విధంగా చెప్పగానే ఆ ముసలి బ్రాహ్మణుడు సౌందర్యమంటే ఇదే కాబోలు ననిపించే సుందర శివునిగా మారి పార్వతి ముందు నిలిచి దరహాసం జేశాడు. అప్పుడు

ఆ॥ సిగ్గులన్ని పూయ చిన్నారి మొగ్గయ్యె
శివుడు పలికెనిట్లు చెలియ నేను
తాళలేను ఇంక తరుణి నీయెడబాటు
పోదుమిపుడె రమ్ము నాదు నెలవు



వ॥ దానికి గిరిజ స్వామీ మీ దర్శన భాగ్యంచేత జన్మ చరితార్థమగునని అహరహం నిన్ను వేడుకుంటూ ఉంటారు. అట్టినీవే నాదరికి వచ్చిన

కం॥ కలదే దానిని మించిన
కలిమియదెవరైన జగతి గనుగొనగలరే
చెలిమిని నినుజేబట్టిన
నెలతయె జగదీశ్వరౌను నీసగ పాలౌ

తే॥ వల్లెయని శూలి వీడెను, పార్వతియును
కూడి చెలులతో జనకుని కడకు బోయె
జరిగినది నేర్చి గిరిరాజు సంతసించి
పెండ్లి యత్నముల్ చేయనై పిలిచె హితుల

వ॥ ఇక్కడ కైలాసమున పరమేశ్వరుడు నందిని దగ్గరకు బిలిచి



తే॥ కామదహనము పిమ్మట కలత జెంది
గిరిజ భీతిల్లి వేగమె అరిగె తనదు
తండ్రి కడనామె ననుగూర్చి తరుణి దెలిపె
రాజు తాను రాకుండె నారాట పడుచు

ఆ॥ నారదుండు జెప్ప నను తపమున నారి
మెప్పుపొందె, నాదు తప్పు తెలిసె
గిరిజ బాల నేను పరిణయ మాడెదన్
సప్తఋషుల దెమ్ము సవినయముగ

వ॥ వెంటనే నందీశ్వరుడు సప్తఋషులకు ఈవార్త దెలిపి వారిని దోడ్తెచ్చెను. సంగతి శివుని వలన విని,

ఆ॥ ఏమి ఘనత మాకు ఇచ్చితివో ప్రభూ!
జన్మలెల్ల దేవ సఫల మాయె
పోయినేడె మేము ఉమ జనకుని కడ
ఆమె నిన్ను గలుప అడుగ గలము



వ॥ సప్త ఋషులు హిమవంతుని కడజేరి ఇట్లనిరి

ఉ॥ నీదగు భాగ్యమేమొ కద నీదు కుమార్తెను
బెండ్లియాడనై
సాదరమొప్పగన్ బిలిచి చక్కగ మన్నన జేసి
మమ్ములన్
ఆ దయనీయుడా హరుడె అల్లుని జేయగ
నీకు, గోరెగా
కాదనకుండ సత్వరమె కాగల కార్యము జేయు
మీయెడన్

వ॥ దానికి హిమవంతుడు సప్తఋషులకు ఇట్లనెను

ఆ॥ క్షమను వేడుకొందు సప్తమునులనేను
నిన్నదాక మేము నిశ్చయమున
నుంటిమయ్య శివుని ఉమకీయ, తదుపరి
తలపుమారిపోయె వలదు మాకు

వ॥ మా బంధుగుల పలుకులు సత్యమని మాకు దోచుచున్నది. ఆతనిలో నవ వధువును రంజింపజేయగల ఒక్కగుణమైనను లేదు. చూస్తూ చూస్తూ మాబాలిక గొంతు కోయలేము, అనగా దానికి మునులిట్లనిరి.

ఆ॥ నీవు జెప్పుమాట నిజముగా దోచియు
పల్లదమ్ము సుమ్మి పాపమగును
సిరులనిచ్చువాడు శివుడంచు దెలియరే
అడుగు భిక్ష భక్తి ఇడును ముక్తి

ఆ॥ మనసు, పలుకు, చేత, మనునొక్కటిగ జూడ
ఆ మహాత్ములకును అవనియందు
మనసు, పలుకు, చేత, మను వేరువేరుగా
దుర్మతులకు రాజ! దురితులకును



ఆ॥ బ్రహ్మ, విష్ణు, దేవపతి గోరునది ఇదే
తారకుడిని జంపుదారి ఇదియె
మన్మధుండు దాను మసి ఆయె దానికై
గిరిజ, హరుల గలిపి కీర్తి గనుమ

ఆ॥ దక్ష యజ్ఞ గాధ తామెరింగించిరి
శివ గిరిజల గలప జెప్పినారు
ఘనుల చరిత లెల్ల వినిపించి తుదకిట్లు
పలికినారు ఋషులు వసుధ పతికి

కం॥ సిరి రా మోకాలడ్డగ
సరియా హిమవంత నీదు సతితో చర్చల్
జరుపుము ఆమెకు నైనను
సరియగు మార్గమ్ము దెలియ సరిజేయును నిన్



వ॥ విషయం హద్దులు దాటుతున్నదని గ్రహించిన మేనాదేవి భర్తతో నాధా! మనకు పరదేవత చెప్పిన విషయాలు జ్ఞప్తికి తెచ్చుకోండి. ఈ పార్వతీదేవియే శివుని పరిణయమాడుటకు జన్మించెదనని చెప్పింది కదా. మరి ఈ పుత్రికా వ్యామోహం తగునా?

కం॥ శివసతి శివునకునీయగ
ఎవరము మనకేది హక్కు హిమనగరాజా
అవునను మునులకు నిప్పుడె
అవునా సరి వ్యర్ధమైన ఆలోచనలున్

వ॥ వెంటనే హిమవంతుడు తప్పు తెలుసుకుని మన్నింపు కోరి చక్కటి విందునిచ్చి మహానుభావులారా ఇప్పుడే వివాహ సుముహూర్తము నిర్ణయింపుడని కోరెను.

తే॥ మాఘ శుద్ధ ఏకాదశి మన్నికైన
మంచి సుముహూర్తమని మేము యెంచినాము
నేటి కయిదవ దినమది నీకు గలుగు
వ్యవధి స్వల్పము జాప్యము వలదు నీకు



వ॥ తదుపరి సప్త ఋషులు పెండ్లి కుమారుని ఆహ్వానించు శుభలేఖను తయారు జేసిరి. ఓ ఆదిదేవా శంకరా! మాఘ శుద్ధ ఏకాదశి నాడు తెల్లవారు జామున, ఆరుద్ర నక్షత్ర యుక్తమైన వృశ్చికా లగ్నమున సుముహూర్తమున పరమ శివులైన తమరికి చి॥ల॥సౌ॥ పార్వతి యను మా పుత్రికను ఇచ్చి వివాహము జేయుటకు పెద్దలు నిశ్చయించినారు. ఇందుకు మీ సమ్మతి కలిగిన సుముహూర్తమునకు విచ్చేసి మా పుత్రికను వివాహమాడి మమ్ములను చరితార్ధులను జేయ ప్రార్ధన. ఈ శుభలేఖ హిమవంతునికి మేనాకు ఇచ్చి సత్కారములు గొని సప్త ఋషులు వెడలిపోయిరి.

తే॥ పిదప హిమరాజు గర్గుని పిలువనంపి
మాకు కులబ్రాహ్మణులు మీరు మాకు గురులు
దీని నందించి శివునకు వాని సమతి
తెమ్ము ఓ మహాత్మా! మాకు నిమ్ము ముదము

వ॥ గర్గ మహాముని తపోగమనమున కైలాసమును జేరి శంకరునికి శుభలేఖ అందించి స్వామీ తమ సమ్మతి నెరింగింపుడని వేడెను.

కం॥ ఇచ్చెద నాసమ్మతి నిటు
వచ్చెద సుముహూర్తమునకు పరిణయమాడన్
తెచ్చెద నా స్వజనంబుల
మెచ్చగ మీ జరుపు పెండ్లి మిమ్మెల్లరనున్

వ॥ ఆ మాటలకు గర్గ మహాముని మిక్కిలి ఆనందించి హిమవంతుని జేరి ఓ హిమవంతా నీదే భాగ్యము

కం॥ ధన్యుడనైతిని నేనిటు
ధన్యంబౌ నీదు కులము తరుణీ సుతులున్
ధన్యంబయె నీ జన్మము
కన్యాదానంబు హరుకె గావింతువుగా



వ॥ వెంటనే హిమవంతుడు సుతశతము, బంధుమిత్రులు తోడ్పడగా పెళ్ళి పనులు మొదలు పెట్టాడు.

సీ॥ బియ్యము, గోధుమల్, పిండ్లు తయారయ్యె
మిరపకాయలు నేయి మినుములవియు
మెంతులు, ఆవాలు, మిరియాలు, బెల్లము
జీలకర్ర, పసుపు, చింతపండు
తేనెలు, చక్కెర, నూనె పీపాలును
కొబ్బరి, వక్కలు, కూర్చినారు
కదళీఫలములను, ఖర్జూర, యేలకుల్
తమలపాకులు, పోకలు మరవెన్నొ

తే॥ చీని చీనాంబరములను జేర్చినారు
విస్తరాకులకట్టలు పేర్చినారు
బావులును తటాకములవి వరుస వెలసె
విశ్వకర్మ నిర్మించెను విడిది వసతి



వ॥ రాజు తలుచుకుంటే దెబ్బలకు లోటా అన్నట్లు పరమేశ్వరుడి పెండ్లికి పని సహాయం చేయని వారెవరు. జగన్మాత కళ్యాణానికి సాహాయపడని వాడెవడుంటాడు. ఆ విధంగా అన్నీ సిద్ధమయ్యాయి. పార్వతిని పెండ్లి కుమార్తెను చేశారు. ఆవిధంబెట్టిదనిన

సీ॥ వృద్ధ సువాసినుల్ ఉల్లంబులలరగ
వధువును జేయంగ వచ్చినారు
పన్నీట గిరిజకు బాగుగా స్నానంబు
జేయించి ఒళ్ళార జేసినారు
సాంబ్రాణి పొగతోటి చక్కంగ తలనార్చి
పట్టు వస్త్రంబులన్ గట్టినారు
జవ్వాజి, పునుగులు చందనంబులు వ్రాసి
తిలకంబు నొసటను దిద్దినారు

తే॥ పెండ్లి కూతును గూడి దీవించినారు
మేనకున్ హిమవంతుకు మేను పులక
రించ తనయను బిగి కౌగిలించినారు
కనులు కార్చంగ ముదమున కంటినీరు



వ॥ ఇక అక్కడ కైలాసంలో శివుడు ఇట్లా ఆలోచిస్తున్నాడు.

తే॥ అయిదు రోజులు సమయము వ్యవధి మితము
మూడు లోకాల వాసులు ముఖ్యులాయె
ఎట్లు తెలుపుట వీడక ఎవనినైన
బాగ చింతించె నూతన వరుడు శివుడు

వ॥ వెంటనే వాయుదేవుని స్మరించి ఆతడు తన సముఖమునకు రాగానే వాయుదేవుని జూచి శివుడు అతనిని పిలిపించిం కారణం ఇట్లా వివరించాడు.

కం॥ తేవలె నారద మౌనిని
ఆ వాయువు తోటి జెప్పె హరుడంతటతాన్
రావించ మౌని అడిగెను
దేవా! నను బిల్వనేల? తెలుపుము దయతో

వ॥ నారదా! నీకు తెలియని సంగతి యుండునా అయిననూ చెప్పెదను వినుము.

వ॥ పార్వతితో నా కళ్యాణము నిర్ణయమైనది. అయితే ముహూర్తము మాఘ శుద్ధ ఏకాదశినాడు అయినందున వ్యవధి చాలా తక్కువగా నున్నది. పేరుపేరునా అయినవారి నందరిని బిలుచుట కష్టము వాయువేగ మనో వేగములతో ప్రయాణించ గలిగిన నీకొక్కడికే సాధ్యము.

కం॥ పిలువుము పిన్నల పెద్దల
చెలువముతో మూడులోక శ్రేష్ఠులనెల్లన్
అలసత్వమంది రానిచొ
తెలుపుము పాషండు లగుచు తీరుదురనుచున్

కం॥ ధనదుని నీతో రమ్మని
కొని తెమ్మావాని తానుకూర్చును ధనమున్
ఎనలేనిదైన గానీ
వెనకాడక నిచ్చునతడు పెండ్లికి వినుమా



తే॥ బ్రహ్మ విష్ణు సురేంద్రులు వచ్చిజేర
హరుడు ముదమంది విడిది కాహ్వాన మిచ్చె
బ్రహ్మతా బురోహితుడౌను పరిణయమున
విష్ణుశ్యాలకుండయ్యెను ప్రేమమీర

వ॥ దేవతలందరు బంధుగులై, శ్రీలక్ష్మి సరస్వతి, శచీదేవి అరుంధతి ముత్తైదువలై, బృహస్పతి నిర్ణయించిన ముహూర్తమునకు శివునకు మంగళ స్నానము చేయించిరి.

కం॥ హరిచందనమును బులిమిరి
హరునకు విరిపూలమాల నలరించిరిగా
నెరవేర పెండ్లి శుభముగ
తిరుదీక్షా బంధనమ్ము త్రినేత్రు కమరెన్

వ॥ సప్తఋషులు నవగ్రహ పూజ జేయించి వేద పఠనముతో మంగళాశాసనములు జరిపిరి. ఇక మొగపెండ్లివారి పటాలం ఎంతుందో చూస్తె ఆశ్చర్యంతో కళ్ళు



తిరుగుతాయి. రుద్రగణాలలోని ప్రముఖుల జాబితా ఎలా వుందంటే శంఖకర్ణుని సేనలో ఐదుకోట్లమంది గణములున్నాయి. మందారకుని సేనలో ఆరుకోట్లమంది, దుంధుభి సేనలో ఎనిమిది కోట్లు, గండపర్వతుని సేన పదికోట్లు, అగ్నిముఖుని సేన ఒకకోటి, ఆర్యముడి సేన ఒకకోటి, చతుర్వక్త్రుడి సేన ఒకకోటి మంది ఉన్నారు. వీరంతా మంచి తిండి పుష్టిగలవారు. ఇక దళపతులు వీరభద్రుడు, భద్రకాళి, నందీశ్వరుడు, చండీశ్వరుడు, భైరవుడు మొదలైన ప్రముఖులు. ఇది శివసేన. ఇక బంధుగులు దక్షప్రజాపతివైపు నుంచి పదినెలు వారి కుటుంబ సభ్యులు కేవలం చంద్రునికి ఇరువది ఎనిమిది మంది భార్యలు, అగ్నిహోత్రుడు, కశ్యపుడు ఇలా చాలామంది శివునితోడల్లుళ్ళు వారి కుటుంబాలు ఉన్నాయి. దేవ, యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుష, చారణ విధ్యాధరులలోని ప్రముఖులు, నాగ, రాక్షస, నర ప్రముఖులు ఆ శివుని ప్రియ భక్తులు ఉండనే ఉన్నారు.



సప్త ఋషుల వంటి మహా మునులు, ఆదిత్యాది నవగ్రహములు, అశ్వనీ దేవతలు, నారద, హూహాహూహాహా, తుంబురులవంటి సంగీత శిఖామణులు, దితి, అదితి, దేవహూతి, గాయత్రి, సావిత్రి, అరుంధతి వంటి మాతృమూర్తులు, అప్సరసలు, బ్రహ్మ, విష్ణు సురేంద్రాది ప్రముఖులు, సరస్వతి లక్ష్మి శచివంటి వారి భార్యలు ఈ విధంగా ఎంతమందని జెప్పగలము. శివభక్తుడు, శిష్యుడు కాని వాడెవడు?

కం॥ జగదీశుడె తరలొచ్చిన
జగతిని రాకుండ యింక సాధ్యంబగునే
భగవంతు బెండ్లి జూడని
దగు జన్మంబేల గాల్ప అని వచ్చిరటన్

వ॥ ఇటువంటి సేన వస్తుంటే వివిధ వాహనాల మీద, వాటిరొదతోను తప్పెట్లు మృదంగాలు వంటి వాయిద్యాలతోను, వస్తున్న ఆ మగపెళ్ళి వారిని జూచి ఆడపెళ్ళివారు నోటమాటలేదు.

కంll విశ్వంబునకే నాధుడు
ఈశ్వరుడని యెరుగమైతి మీక్షణమునసే
విశ్వంభరక్రుంగునొాయను
విశ్వేశ్వరు సేనజూచి భీతియు కలిగెన్

ఆll విడిది చాలదేమొ భీతియు కలిగెను
ఆడపెళ్ళివారి ఆత్మలందు
శివుడె రక్షయంచు చేయెత్తి మొక్కగా
చివరికంత శుభము జేసె శివుడు.

కంll చారుల వల్ల నెరింగెను
ఆ రాజట శివుని రాక ఆనందముతో
దార, పురోహితులనుగొని
జేరుచు హరుకాళ్ళు కడిగి జెప్పెను అటుపై



ఉll మన్నన కోరెదన్ తమరు మాయెడ గౌరవ
ముంచి జేరిమ
మ్మెన్నితి వోదయామయుడ ఈశ్వర నేరము
లెంచకయ్యనన్
ఎన్నను గాని నాసుతను ఈప్సితమందగ
ప్రేమజూడుమో,
పన్నగ భూషణా! గిరిజ బాలను నీవిటు
పెండ్లియాడుమా.

వll శివుడు చిరునవ్వుతో మామగారిచ్చిన గంధము, తాంబూలము స్వీకరించెను. అలంకార భూషితుడై అతి మనోహరంగా కనిపిస్తున్న శివుని జూచి ఆడపెళ్ళివారు.

కంll హరుడట ఈతడును మనో
హరుడట సౌందర్యమూర్తి అందము నెంచన్
తరమా సామాన్యులకును
గిరిజా హృదయేశు ఈశుగీర్తింతముగా



వll ఆ తర్వాత అత్తగారు మేనాదేవి అల్లునితో

తేll ఓ సదాశివ! మూర్ఖత నొంది మేము
నీకు ద్రోహము జేస్తిమి నిందజేసి
పరుల మాటలు వినువారు బాధపడుట
జరుగు, మన్నించి పార్వతిన్ కరుణ గొనుము

వll శివుని చిరునవ్వే ఆమెకు సమాధానమైనది. లక్ష్మీ నారాయణులవలె, రతీ మన్మధుల వలె ఒకరికి తగ్గట్లు ఇంకొకరున్న ఆ జంటను జూచి అందరూ సంతోషించారు. మంగళ వాయిద్యాలతో శివునికి ఎదురుకోల చక్కగా వచ్చారు.

ఆll వరుడు విడిది జేర బందుగులందరు
వరుని పూజచేయవచ్చి రపుడు
రాజదంపతులును రంజిల్ల వరపూజ
జరిపి సెలవు గొనిరి సంతసమున



వll వారి కులాచారము ననుసరించి నూతన వధువు దీర్ఘ సుమంగళిగా వర్ధిల్లుటకు ఆలయమునకు స్వయముగా బోయి అంబికా దేవిని పూజించవలెను.

ఆll జనని, చెలుల వెంట శైలజ భక్తితో
అంబికాలయమున కరిగెనపుడు
ఆమె సొగసు జూచి ఆ పురి ప్రజలెల్ల
అందమనగ నిదియె అందమనిరి.

కంll నలుపింత అందమౌనని
తెలియమె ఇన్నాళ్ళు మనము దేవిని జూడన్
తెలిసిన వారలమైతిమి
నలుపే నాణ్యంబటన్న నానుడి నిజమే.

ఆll ధవళ ఛాయవాడు శివుడీ ఉమను గూడ
పగలు రేయి యట్లు సొగసు జంట
ఒకటిలేక మరొకటొకనాటి కుండవు
అంచు తలచి రెల్ల అచటి జనులు

ఆ॥ సమయమైన దంచు సత్ బ్రాహ్మణులు దెల్ప
వరునితోడి తెచ్చు పనికి బోవ
మేళ తాళములతొ మేనయు హిమరాజు
హరుని రమ్మనంచు అడిగిరపుడు

వ॥ ఐరావతంపైన కూర్చున్న శంకరుడు వరుని అలంకరణతో చూచుటకు రెండు కనులు చాలవన్నంత ఠీవిగా కళ్యాణ వేదిక వద్దకు జేరి ఉన్నతాసనంపై కూర్చున్నాడు.

కం॥ గిరిజను పరిణయమాడెను
హరుడే విధి, తెలియ దాని అఘములు తొలగున్
తరమా మాటల దెలుపగ
పరిమిత జ్ఞానంబు కలుగు భక్తునికైనన్

వ॥ ఉన్నతాసనంపై కూర్చున్న కపర్ధి చెంతకు హిమవంతుని ఆజ్ఞయై మైనాకుడు ముత్తైదువులతో పాటు వెళ్ళి



ఆ॥ పరిమళములు జల్లు పన్నీట స్నానంబు
జేయ ధూపమేసి శ్రేష్ఠమైన
పట్టుబట్ట లిచ్చి పెట్టిరి కళ్యాణ
తిలకమపుడు హరుకు దిష్టి తీసి

ఆ॥ కుడియెడమల యందు నడువంగ హరిబ్రహ్మ
వెనుక గొడుగు బట్టె వేల్పులపతి
చేయిబట్టి దెచ్చె జేజెల మాతయు
ఆసనంబు శివుని కమరజేసె

వ॥ అప్పుడు హిమవంతుడు సతీసమేతుడై యేతెంచి, బ్రహ్మ, విష్ణు సురేంద్రులకు భక్తితో ప్రణమిల్లి, శివుని అనుమతితో పురోహితులు పుణ్యాహ వాచనము జెప్పగా, కన్యాదానమునకు సంకల్పము జెప్పి రక్షాబంధనము గట్టిరి.



కం॥ ఉపవీతంబును మార్చిరి
అపరంజి కలశమునెత్తి హరుపాదములన్
తపము ఫలించగ కడిగిరి
అపరమితంబైన భక్తి ఆ దంపతులున్

తే॥ పుటిక బంగరు దొక్కటి పూనిదెచ్చి
ఉమను కూర్చుండ బెట్టిరి 'మామ' లంత
ఆ ముహూర్తపు వేళకు ఆర్చినారు
'పచ్చడమ' ను తెరకు మధ్య పదిలముగను

వ॥ అంతలోకాచార ప్రకారం పార్వతీ పరమేశ్వరుల గోత్ర నామాదులు జెప్పించి, ఆమె కుడిచేతిని శంకరుని కుడిచేతిలో వుంచిన హిమవంతుడు భార్యా సమేతుడై శివునికిట్లనెను.



ఉ॥ ఓ పరమేశ్వరా! కరుణ నొందుచు జెప్పెడి విన్నపంబులన్
మా పరితాపమార్పగను మన్నన జూపుచు ఆలకింపుమా
ఏ పొరపొచ్చ మెంచకుము ఈమెను ప్రాణము వోలె జూడుమా
చూపుము నీదయన్ చెలిమి జూపుము ఈమెకు రక్షనీయుమా

వ॥ దానికి ఈశ్వరుడు సంతోషంతో 'దేవస్య' అని వేద వాక్యములను లోకహితార్థముగా పలికి అతి ముఖ్యమైన 'నాతి చరామి' అని ముమ్మారు బలికెను. ఈ వాక్యములను జెప్పుచున్నప్పుడు.

తే॥ తనదు కుడిచేతి నీశుడు తరుణి శిరసు
మీదనుంచె జీరగుడపు మిశ్రమమును
గిరిజ తనుకూడ అదెరీతి జరిపెనపుడు
తెరను ఆ పురోహితుడటు తీసివైచె

కం॥ తనుగని నగవును గిరిసుత
తననే తను మరచి పోయి తనపతి జూచున్
తను తేరుకొనుచు తదుపరి
తన తల తనువంచినవ్వు తను పులకించన్

వ॥ అటువైపు జగత్పతి పరిస్థితీ అలాగేవుంది. తనని బ్రహ్మ, విష్ణు, దేవేంద్రులుగాని సమీపంలోనే కూర్చున్న దేవమాతలు గాని చూస్తారేమోనని ఆ విశ్వనాధుడు బిడియ పడుతూ అవకాశం దొరికినప్పుడల్లా జగన్మాతను కొంటెగా చూస్తూనే ఉన్నాడు.

ఆ॥ తాళిగట్టె శివుడు తాను తలంబ్రాలు
తరుణి శిరసుమీద కురియ పోసె
ఆమె వీడిసిగ్గు ఆ తలంబ్రాలను
అట్లెపోసి నవ్వె అతనిపైన



వ॥ ఆ దృశ్యమును జూచి ముల్లోకములు పరవసించెను. వసిష్ఠుడు మొదలైన మహామునులు పార్వతీ పరమేశ్వరుల చేత అగ్ని కార్యము నిర్వర్తింప జేయుటకు అవసరమైన హోమములు జేయించిరి. పిమ్మట స్థాలీ పాకము, సదస్యము, అలక పానుపు, బంతులాట మొదలగు లోక వ్యవహార ముచ్చట్లను జరిపించిరి. శేష హోమము, నాగబలి మొదలగు వివిధ కార్యక్రమములతో అయిదు రోజుల పెళ్ళి అతి వైభవంగా జరిగింది.

ఆ॥ పెళ్ళి భోజనంబు పిన్న పెద్దల నెల్ల
తృప్తి పరచె ప్రజను తనివిదీర
ఏమి గౌరవంబు ఇచ్చోట ననుచును
సంతసించినారు జనములెల్ల

వ॥ అయిదు రోజులూ అయిదు క్షణాలుగా గడిచిపోయి ఆరవదినమున దేవమాతల పర్యవేక్షణలో బ్రహ్మ విష్ణు దేవేంద్రులు, మహాఋషుల అనుమతితో వేద విహితమైన నిర్ణయం ప్రకారం పార్వతీ వరమేశ్వరుల పునస్సంధానమును గూర్చి చర్చ జరిగినది.



ఆ॥ ఆడపెళ్ళివారు అందరాలోచించి
తాముజెప్పినారు తగు సమయము
దేవమాత లెల్ల అవునన సతిపతుల్
కలయిక సమయమును దెలిపినారు

వ॥ ఆ ముచ్చట కూడ వేదోక్తంగానే జరిగింది.

ఆ॥ బ్రాహ్మణులకు వారు పైడి దానంబులన్
తెరపిలేక నిడిరి తృప్తిదీర
ముదము దీరవారు ముత్తైదువలకెల్ల
వస్త్ర దానములను బనిపినారు

ఆ॥ కేళికా గృహమున క్షీర పాత్రంబులన్
పానపాత్రములను బనిపినారు
సుధను యుంచినారు మధుర పదార్థముల్
దంపతుల కొఱకును అంపినారు



వ॥ పాటలతో వీణామృదంగ వాయిద్యములతో, నృత్యాలతో పకపక నవ్వులతో స్త్రీలంతా సమయము గడిపి బయటకు పోతూ చలోక్తులతో కవాటమును బంధించి లోపల గడియ వేసుకోమని పురమాయించి వెడలిపోగా,

కం॥ ఆనంద పరవశుండై
తానా విరహంబు నాప తన వశమవకన్
తానామె జేర్చి యెడమను
ఆ నాధుడు శంకరుండు అక్కున జేరెన్

వ॥ ఎన్నో దినముల అనంతరం జరిగిన ఆది దంపతుల కలయిక అది. ఆనంద పారవశ్యం అంబరవీధిని తాకుచుండగా శివపార్వతులు,

కం॥ ఇచ్చకములు తామాడిరి
ముచ్చట్లతొ మొదటి రేయి మొత్తము గడుపన్
నచ్చదు ఎవ్వరికైనను
అచ్చెరువది జరుగునదియె ఆ తొలిరేయిన్

వ॥ కోడి కూత విని నిద్రలోకి జారిన ఆ ఆది దంపతుల తొలిరేయి వర్ణించుట ఎవరికి సాధ్యం? అంతే అంతకంటే మాటలు లేవు.

కం॥ చిరకాలము విడి కలిసిన
పరమేశుని పార్వతులను బాధించగ కొ
క్కొరోకో అని వినవచ్చెను
పెరిగెడి దిగులంది వారు వీడిరి జంటన్

తే॥ సభలొ విద్యాధికుని జూచి చవట ముఖము
తెల్లబడు రీతి మారెను దిక్కులన్ని
పెద్ద ముత్తైదువ నుదుట బెట్టుకున్న
బొట్టుగా దోచె ఉదయించునట్టి రవియు



వ॥ ఇంతలో బిలబిలమంటూ స్త్రీలు ముత్తైదువలు వచ్చి పార్వతిని పడక గదినుంచి తీసుకొని వెళ్ళారు. ఆ విధంగా జత వీడిన నూతన వరుడు తన శయ్యపై పరుండిపోయాడు.

కం॥ అలసట జెందిన హరుడును
అలుపది దీరంగ పడక నటు శయనించన్
చెలిమిని బ్రహ్మాదులు దరి
బిలుచుచు తముజేరినారు విభునచ్చోటన్

వ॥ వారి సరస సంభాషణములతో శివుడు స్వస్థత జెందెను. ఇక ఆ జగత్పిత సంగతి అలావుంటే లోకంలో సాధారణ కామక్రోధాను వర్తనులైన స్త్రీ పురుషుల గురించి చెప్పేదేముంది? పగటి వేళ పలువిధములుగా కయ్యాలైనా రాత్రి సయ్యాటకు సర్దుకు పోతుంటారు.



ఆ॥ రేయి ఇంకరాదు లేదే మనశ్శాంతి
కొత్త దంపతులను కోర్కెగాల్చు
జగతి వారి గోడు సంధ్యరాకతొ దీరు
కనులు కాయలైన కాదు రేయి

కం॥ జారులు చోరులు తము సం
బరపడువేళాయె, స్త్రీలు వయ్యారముగా
పురుషుని రాకకు అతి, తొం
దరపడుచును వగచు వేళ త్వరగా వచ్చెన్

వ॥ అట్లు సూర్యాస్తమయమవగానే చల్లటి హిమకిరణుడైన చంద్రోదయం జరిగింది.

కం॥ తెల్లని మల్లెలు విరిసెను
చల్లని చంద్రుండు నింగి చక్కగ మెరిసెన్
చెల్లవు మీకయ్యంబులు
ఉల్లములలరంగ రతుల నుండుండనుచున్



వ॥ అలా అలుకలకు మంగళం పాడి సతీపతులు మన్మధ సామ్రాజ్యంలో విహరించు చుండిరి.

ఆ॥ చంద్రుడస్తమించ శ్రమ కోర్వలేనట్టి
సతులు అలసిపోయి శయ్యజేరి
నిదురమునుగువేళ, నీరజాక్షి గిరిజ
చెలులతోటి జేరె శివుని వీడి

వ॥ ఈ విధంగా రేయి ఆనందముగా గడిపిన శంకరుడు సూర్యోదయం కాగానే ప్రాతఃకాల విధులను నెరవేర్చి, బ్రహ్మాదులు పలుకరించుటకు రాగా ఉత్సాహముగా ముచ్చటలాడుచు సంతోషముగా నుండెను.

కం॥ మానవ మాత్రులకే విధి
యౌనో శివపార్వతులకు అవు శోభనమున్
వీనుల విందుగ జెప్పగ
ఏనాటికి సాధ్యమౌనె? ఇది నిజము కదా!

ఆ॥ బ్రహ్మ విష్ణుమూర్తి వాసవుడును గూడి
శివుని ఆజ్ఞపొంది చేరి నృపుని
తిరిగి పోవు గోర దీనుడై గిరిరాజు
వారికిట్లు బలికె పదములంటి

కం॥ కలదే దేవతలొక్కటై
చెలిమిని భువిజేరి తాము శివ సన్నిధిలో
కలియుచు మానవునింటను
నిలచుట ఇన్నాళ్ళు కరుణ నిండగ ఆహా!

వ॥ అయిననూ నా బాగ్య వశంబున మీరు నా ఇంట నున్నారు. మరికొద్ది రోజులలో నా బాలికను శివుని వెంట పంపునపుడు తమరు వెళ్ళవచ్చునని నా విన్నపము. దానికి బ్రహ్మాదులు అంగీకరించి కొన్నాళ్ళు హిమవంతుని తావుననే గడిపిరి.



ఆ॥ నంది బిలువ నంపి నయమున జెప్పిరి
హిమనగేశు కడకు ఇపుడె బోయి
ఈశ్వరునితొ ఉమను ఇంపుగా కైలాస
మునకు బంపుమనుచు ముదము మీర

కం॥ పరమేశుని మనమెరిగిన
గిరిపతి తనపత్ని గూడి గిరిజా రమణిన్
హరునితొ కైలాసమునకు
నిరుపమ యత్నమున బంప నిపుణత తలచెన్

వ॥ హిమవంతుడు మేన తమ ఆంతరంగికులతో చర్చించి పార్వతి వెంట మనోహరమైన వస్త్రంబులను, సువర్ణ రత్నాభరణంబులను, పార్వతికి ప్రియమైన వాహనమగు సింహమును, కొన్ని దినములకు వలసిన ధాన్యమును సంబారములను నవదంపతులకు కావలసిన కస్తూరి వంటి సుగంధ ద్రవ్యములను, లవంగములు, యేలకులు, కుంకుమ పువ్వు వంటి పరిమళ ద్రవ్యములను, గజ తురగముల వంటి వాహనములను,



జయ విజయ అను గిరిజ ఆంతరంగిక చెలికత్తెలను, కొంతమంది దాసి జనమును, అంగరక్షకులను తోడిచ్చి బంపుచూ అల్లుడైన శివునితో ఇట్లు జెప్పిరి.

సీ॥ జగతికే ప్రభువీవు సర్వవేత్తవు నీవు
నీకు జెప్పవలెనె నీతి మేము
ఎవ్వారికై నను ఈరోజు రాకుండ
తప్పునే వీడక తమరి సుతను
జన్మతోటి కలుగు సంపర్కములు ఇవి
కన్నీరు ఆగునే కలికి వీడ
క్షణకాలమైనను కలకంఠి గిరిజను
వీడకు కనుసన్నబెట్టు కొనుము

తే॥ చిన్నతనమున పొరబాట్లు స్త్రీ సహజము
మందలించియు మన్నించు మమతజూపి
భర్త మన్నించకున్నచో వనిత కెట్లు?
ప్రాణ సమముగా జూడుము పార్వతినిటు



వ॥ ఈ విధంగా కన్నీటిని బలవంతాన అణగద్రొక్కి చెప్పిన అత్తమామలకు పరమేశ్వరుడు అభయం చెప్పాడు. దేవమాతలు అరుంధతీ దేవి వంటి మహా పతివ్రతలు పార్వతిని దగ్గిరకు తీసుకుని,

ఆ॥ సర్వ మంగళీవు జననివి భువనాల
నీకు జెప్పదగిన నీతి కలదె?
అయినగాని మాకు అందిన భాగ్యమ్ము
వదలుకోము తల్లి! మదిని గొనుము

సీ॥ మగని కిష్టంబేదొ మగనాలిజేవలె
మగువదినుట తప్పు మగడు దినక
పుట్టినింటి ఘనత ఉవిద చాటగరాదు
మగని మించిన నిద్ర మానవలెను
వీధి గుమ్మమునందు వెలది కూర్చొనరాదు
పతియెరుంగక ధన వ్యయము తగదు
తక్కువ వారితో తగవులు తగవమ్మ
దిసమొలతో నింట తిరుగరాదు

తే॥ నర్మ గర్భపు మాటలు నటనలున్ను
వేళ కాకున్న నిద్రించ విహితమవదు
ఒరుల హేళన జేరాదు తరుణులెపుడు
మంకు పట్టది తగదమ్మ మానినులకు

వ॥ స్త్రీలు జేయరాని పనులేవో ఇంకా వినుము

సీ॥ పలుమార్లు దిట్టుట, పకపకనవ్వుట
పళ్ళునూరుట స్త్రీకి వలదు తల్లి!
అనుచితంబగుమాట ఆలోచనే లేక
అనరాదు పరులతో అతివలెపుడు
తుమ్ముట, చీదుట, తుమ్మిన నవ్వుట
పదిమందిలో కాదు వనిత కెపుడు
తలపుణుకుట సభన్ తనవారి పొగడుట
తగ్గు భావన నిచ్చు తరుణి మీద



ఆ॥ దుష్ట చేష్టలమ్మ తులువల చేష్టలు
నయము కావు తల్లి! నారి కెపుడు
గొప్ప భామనైన కొంచెము జేయును
సతులు వీడదగును సరసిజాక్షి!

వ॥ ఇక చేయవలసిన పనులేవో ఒకమారు శ్రద్ధగా ఆలకింపుము.

ఆ॥ కష్ట సమయమందు కలత చెందగ రాదు
తెంపు వీడరాదు ఇంపుకాదు
ఇంటివేల్పు, తులసి, ఇనుని పూజించుట
మానరాదు ఎపుడు మానవతులు

వ॥ ఆ పుణ్యమూర్తులు జెప్పిన సూక్తులు నగరాజ నందన అణకువగా విని ఇట్లనెను.



కం॥ మీరలు చెప్పిన దంతయు
మీరక నేజేతు, ఆన, మించిన శ్రద్ధన్
ఈ రుద్రు అర్ధ భాగపు
నారిగ నేనౌదు నమ్మనాపతి వ్రతమై

వ॥ ఆమె మాటలకు అందరూ సంతోషించి ఆమెను దీర్ఘ సుమంగళ ప్రదాతవు కమ్మని ఆశీర్వదించి శివపార్వతులచే ఎన్నో బహుమానములను బొంది తమ తమ నెలవులకు జనిరి. అప్పుడు బ్రహ్మ, విష్ణు, సురేంద్రులతో వారి కుటుంబములతోనూ మునుల తోనూ కుబేరుని పుష్పక విమానమునెక్కి పార్వతీ సమేతుడై శంకరుడు కైలాసమున తన నిజభవనమును జేరెను. అందరూ ఒక్కొక్కరే శంకరుడు గిరిజల వద్ద సెలవు దీసుకుంటున్నారు. లక్ష్మీ నారాయణులకు మొదట పట్టు వస్త్రములు, నగలు ప్రేమ పూర్వకంగా సమర్పించి శంకరుడు శ్రీమన్నారాయణునితో



కం॥ గిరిజకు అన్నవు నిజముగ
హరి! నా శ్యాలకుడ వైతివా నీప్రేమన్
మరువను, రక్షవుగౌరికి
తరుణులు నీవన్న వైన ధన్యలు గారే?

వ॥ దానికి లక్ష్మీ నారాయణు డిట్లనెను

కం॥ హరిహరుల మధ్య భేదము
నరయుట పాపమగు గాక, అవనీ జనులున్
హరియే హరుడని గొలిచిన
సరిలేని సుఖంబు మోక్ష సంపద గలుగున్

వ॥ ఈవిధంగా అవనీ జనులకు, అందులోనూ, మూర్ఖులై హరికంటే హరుడు గొప్పని, లేక, హరునికంటే హరియే గొప్పని భావించి వారిమధ్య భేద భావం జూపే వారికి కనువిప్పు కలిగేట్లు బలికెను. అనంతరం గరుత్మంతునిపై నెక్కి హరి లక్ష్మీ సమేతుడై వైకుంఠమునకు బోయెను. అనంతరం బ్రహ్మ సరస్వతులను సత్కరించి శంకరుడు పార్వతీ సమేతుడై.

ఆ॥ బ్రహ్మ వ్రాత అనగ వసుధ పేరగు గాక
మార్చలేని వ్రాత మారులేక
వాణి విద్యకెల్ల రాణియై పూజింప
బడును గాక ధరణి ప్రజలజేత

వ॥ ఆ మాటలకు సంతోషముతో విరించి, గీర్వాణీ సమేతుడై హంస వాహనంపై బ్రహ్మలోకమునకు వెడలిపోయెను. అంత, దేవేంద్రుడు శచీదేవి వీడ్కోలు బలుకుతూ గిరిజా శంకరులకు పాదాభివందనం జేసి సెలవిమ్మని అడుగగా చీనీ చీనాంబరములు రత్న ఖచితా భరణములతో వారిని సత్కరించి శివుడిట్లనెను.

తే॥ స్వర్గ సుఖమన్న పేరగు సాటిలేని
సుఖము, లవిగాంచ క్రతువుల జొక్కు జనులు
త్రెళ్ళుటకు అని యోధులు తెంపు జూపు
సత్ప్రవర్తనతో నుండు జగతి జనము



వ॥ దేవేంద్రుడు మహా భాగ్యమని శచీదేవితో స్వర్గమునకు ఐరావతమునెక్కి చనెను. అనంతరం తనపాదాలకు మ్రొక్కి మా జన్మ ధన్యమయ్యెను గదా హే గౌరీ శంకరా మాకు సెలవిమ్మని అడిగిన మునులను, దేవరాక్షస గణములను తన భక్తులను జూచి శివుడిట్లనెను.

కం॥ మృత్యుంజయుడని నమ్ముచు
నిత్యము నను గొలుచు వారినే రక్షింతున్
మృత్యువకాలం బవదిది
సత్యము నామాట అవని సజ్జనులారా!

వ॥ వారంతా వీడ్కోలు దీసుకుని కామ గమనంతో వారి వారి స్వస్థలములకు బోయిరి. అంత వీరభద్రుడు భద్రకాళి శివునకు సాష్టాంగ నమస్కారము జేసి వినమ్రులై ఇట్లనిరి.



ఉ॥ వేదన దీరె నీకు అలివేణికి, పార్వతి
నిన్నుగూడె, మా
చేదగు సాయమేమి, ఇక, చేగొనుమయ్య
గణంబులన్నిటిన్
కాదనకయ్య! మాట వినిగావుము మమ్మిక
వీడుకోలయా
పోదుము శంకరా భువికి వున్నటు లొత్తుము
నీవుగోరుచో

వ॥ అని మహాదేవునికి ప్రమద గణములనొప్పగించి వీరభద్రుడు, భద్రకాళి దక్ష వాటికకు పోయిరి.

కం॥ గిరిజా కళ్యాణంబును
అరయుట సాధ్యంబె? కాదు హరు దయలేకన్
దరిసించ తలపు నైనను
పరమేశుడు గిరిజ గూడి భాగ్యము లిచ్చున్

卐 卐 卐



# తారకాసుర సంహారం

వ॥ ఇదివరలో దక్ష ప్రజాపతి తనకుమార్తెలలో పదిమందిని కశ్యప ప్రజాపతికిచ్చి వివాహం చేశాడని చెప్పబడినది. ఆ కశ్యపుడు ఘటనా ఘటన సమర్థుడు. దేవతలు, రాక్షసులు, నాగులు మొదలైన వారంతా ఆ పదిమందికీ జన్మించిన వారే. దితికి పుట్టినవారు దైత్యులు అదితికి పుట్టినవారు దేవతలు.

కం॥ దైత్యులు కంటకులై భువి
నిత్యము సజ్జనుల జంపి నేరములనునా
దిత్యులకు జేసి వారలు
సత్యము ధర్మంబు దప్పి చరియించిరిగా

వ॥ దీనికి కశ్యపుడెంతో బాధపడికూడా విధినెదిరించలేమని తెలిసి దితికి ఒకటి రెండుసార్లు జెప్పి మిన్నకున్నాడు. హిరణ్యాక్షుడను దుష్టుడు భూమండలాన్ని నాశనం జేయుటకై యత్నించుచుండగా శ్రీహరి వరాహ రూపమున వానిని సంహరించి భూదేవిని కాపాడి భూకాంతుడయ్యెను.

తే॥ పిదప నారసింహుండయ్యె విష్ణుమూర్తి
తాను వధియించె 'తెలివిగా' వాని భ్రాత
యౌ, హిరణ్య కశిపుడను అసురునొకని
దనుజపతిని దుర్మార్గుని దయ విహీను

వ॥ అనంతరం దితి మరొక్కసారి కశ్యపుని వేడుకొని గర్భం ధరించింది. ఓర్వలేని దేవేంద్రుడు వీడెంత దుర్మార్గుడౌ తాడోనని ఆపిండాన్ని ముక్కలుగా వజ్రాయుధంతో నరికాడు. దితి మొరవిని కాశ్యపుడు ఆ ముక్కలికి ప్రాణం పోయగా మరుత్తులు జన్మించారు. కాని వారు సజ్జనులై దేవేంద్రుని సేవించారు.

కం॥ వేదన జెందెను యంతట
ఆ దితి తను భర్త గోరె, ఆతడు తెలిపెన్
ఓ దితి! పదివేలేండ్లుగ
వేదనుచున్ బ్రహ్మమీవు వేడుము తమితో



వ॥ ఆ తవః ప్రభావమున దితి మరొక్కమారు వజ్రకాయుదును పొడుగాటి వాడైన పుత్రుని పొందింది. ఆతడు వజ్రాంగుడను పేరుతో పెరిగి పెద్దవాడై తల్లి బోధల వల్ల దేవేంద్రునిపై దండెత్తి, ఓడించి స్వర్గాధిపతియైన ఇంద్రుని పారద్రోలాడు. అయితే అతను సౌమ్యుడు. బ్రహ్మ అతనికి నచ్చజెప్పి ఇంద్రునికి తిరిగి స్వర్గాధిపత్యం ఇప్పించాడు. అప్పుడతడు బ్రహ్మతో

కం॥ ఓ పరమేష్ఠి నిజం బివి
నా పలుకులు, దుష్టుడితడు, నయవంచకుడున్
నీపై గౌరవముననే
నీ పలుగాకిని వదలెద ఇష్టములేకన్

తే॥ బ్రహ్మ ముదమంది వజ్రాంగు భక్తి మెచ్చి
వరమునే దేని భక్తుని గోరుమనగ
తనకు పరబ్రహ్మమును, భూతదయను ఇమ్ము
అన్న పరమేష్ఠి ముదమంది అతని కొసగె



వ॥ ఓయీ వజ్రాంగా! నీకోసం వరాంగి అనే కన్యను సృష్టిస్తున్నా. ఆమెను వివాహమాడి ఈశ్వర భక్తుడవై సుఖముగా నీ రాజ్యమును పాలింపుము అని జెప్పెను. ఆమె అతనికి అత్యనుకూలవతి ఆయెను.

ఆ॥ వరము వేడు మనెను వజ్రాంగు డొకనాడు
తనను భక్తి గొలుచు తరుణి జూచి
ముజ్జగాల నేలు ముద్దు తనయుగోరె
ఆ వరాంగి పతిని అమిత భక్తి

కం॥ ఎంతటి చంచల లయ్యో!
ఇంతులు, సాత్వీకుగాని ఎవ్వని ఆ శ్రీ
కాంతుడు బ్రతుకగ నీయడు
అంతము తాజేసి తీరు అసురాంతకుడై

వ॥ అయిననూ కోరక కోరక కోరిన నీకోర్కె కాదనలేను. నేను బ్రహ్మకై కఠోర తపంబొనరించి నీకోర్కె తీర్చెదనని వజ్రాంగుడు తపోవనమునకు బోయి...



తే॥ ఒంటి కాలిపై నిలబడి యొగ్గి భక్తి
ఊర్ధ్వ బాహుడై నింగిపై యుంచి దృష్టి
ఘోర తపమును పరమేష్ఠి గూర్చి జేసె
చాలకాలము ఆ బ్రహ్మ సంతసించ

వ॥ ఆతని యెదుట ప్రత్యక్షమైన బ్రహ్మ, ఓ వరాంగా నీ తపస్సుకు మెచ్చాను. ఏదేని వరం కోరుకోమన్నాడు.

ఆ॥ ధన్యుడైతి నేను దయయుంచి నాభార్య
గర్భమందు నీవు కరుణ జూపి
అప్రతిహతుడైన యట్టి పుత్రుని ఇమ్ము
సురుల గెల్చువాని శూరునొకని

వ॥ బ్రహ్మ తథాస్తు అని అంతర్ధానమయ్యెను. తపము జాలించి ఇంటికి వచ్చి భార్యకు జరిగింది జెప్పి సుఖంబుండెను. కొన్నాళ్ళకు వరాంగి గర్భం ధరించి పదియవనెలలో మహా బలశాలియైన ఒక బిడ్డని ప్రసవించింది.

సీ॥ పర్వతములు, నదుల్, వనములు అల్లాడె
భూమి కంపించెను ఉల్కలు పడె
సుడిగాలి గూల్చెను అడవి జెట్లను గూడ
పరివేషములు చంద్రుని రవి జుట్టె
కుక్కలు, నక్కలు, గుడ్లగూబలు కూడ
వాపోయె భీతితో వసుధపైన
పశువులు భయమెక్కి వదలెను మూత్ర పు
రేష మలములను ఘోషవెట్టి

తే॥ పెక్కు ఉత్పాతములు దోచె వెరచెనవని
క్రూర గ్రహములుచ్చస్థితి కూడియుండె
ఆ వరాంగికి జన్మించె అసురుడొకడు
తారకుడు అని బ్రహ్మయే తాను బలికె

ఆ॥ పర్వతంబు వోలె సర్వాంగములు బెంచి
తారకుండు బెరిగె తను క్రమముగ
వాని జూచి తల్లి బడసి సంతోషమ్ము
బ్రహ్మవరము పొందబాగు అనెను



వ॥ తల్లిమాట శిరోధార్యం కాగా పరమేష్ఠిని గూర్చి ఘోరతపంబు నాచరింప దొడంగెను.

సీ॥ కాలి బొటనవ్రేళ్ళ నిలుచుండి, బాహువుల్
ఎత్తి, సూర్యుని జూచి యేమి దినక
నూరేండ్లు బ్రహ్మకై ఘోరతపంబును
గావించె తారకుడా విధమున
తలక్రిందుగా నుండి, వ్రేలాడి చెట్లకు
నిలిచి అగ్నిని, నిల్చి జలమునందు
వందేండ్లు ప్రతిచోట, పరమేష్ఠి బ్రార్థించె
జగములల్లల్లాడె అగడు పెరిగి

తే॥ దేవ లోకము వేడిమి తీవ్రమవగ
మొరలు బెట్టిరి బ్రహ్మతో సురులు, గావ
బ్రహ్మ తారకు జేరెను వాని నడిగె
కోరు మేదేని తారకా! దీరు నీకు



వ॥ అప్పుడు తారకుడు అతి తెలివితో బహు విచిత్రమైన కోరిక కోరాడు.

కం॥ లోకములనే జయించెద
నాకోరిక దీర్చుమయ్య నాపై దయచే
చేకొన మరణము బోరుచు
నాకా శివవీర్యజనిత నందను జేతన్

వ॥ ఆ సమయమున శివుడు సతి మరణముచే విరాగియై

తే॥ హరుడు గణములనన్నిటి వీరభద్రు
కొప్పగించెను తాపసై ఒంటరవగ
శివుడు ధ్యానించి పరబ్రహ్మ జేసె తపము
ఇంక వీర్య జనిత పుత్రుడెట్లు కలుగు!

వ॥ ఇది జరిగే పని కాదని తెలిసి, గర్వించి, శుక్రాచార్యుడు నిర్ణయించిన ముహూర్తానికి దేవతలపై దండెత్తాడు, తారకుడు.



కం॥ సురపతి, ధనదుని, ధర్ముని
వరుణుని యోడించెనతడు పలుకానుకలన్
సురనేతలచే బొందెను
సరిలేని సువర్ణ రత్న సంపదలందెన్

వ॥ నారదుడు సుర, అసుర, మానవ జాతుల వారెవరితో నైనా సఖ్యంగా యుంటాడు. ఇక్కడ సమాచారం అక్కడ, అక్కడిదిక్కడా చేరవేస్తూ లోక కళ్యాణం కోసం రాక్షసులకి సుముఖంగా వుంటూ వాళ్ళచే ఎక్కువ చెడు చేయిస్తూ పాపం పండే విధంగా చేస్తాడు. దానివల్ల భగవంతుడు ఆ పాపుల్ని సంహరించి లోక కళ్యాణం చేకూరుస్తాడు. అట్టి నారదుడు తారకుని వద్దకు వచ్చాడు.

ఆ॥ దేవమునికి మ్రొక్కి దీవెన జేకొని
విశ్వ విజితుడైతి వెరపులేక
దశ దిశలకు పేరు ధాత్రి నొందితి నింక
అడ్డు నాకులేదు, అవున? మౌని

వ॥ దానికి నారదుడు నవ్వి ఇలా అన్నాడు

కం॥ తొలి నీ పెద్దలు బూనుచు
నిలువగ బోరాడిరయ్య నీరజ నాభున్
విలువగు ఆతని దునిమిన
ఇలనిక మ్రొక్కెదరు నీకు ఈశ్వరుడంచున్

వ॥ ఆ మాటలకు మరింత మదించిన తారకుడు సేనలను సేకరించుకొని వైకుంఠంపై దండెత్తాడు. వాడి వరబలం తెలియుట జేత.

కం॥ కనబడ డాయెను శ్రీహరి
పెను శ్రమచే తారకుండు వెదకిన గానీ
వెనుదిరిగె నతడు విష్ణువు
తన నోడించంగ లేక తాబారె ననెన్

వ॥ ఇక గర్వంతో కన్ను మిన్ను గానక దేవతలను తన సేవకులను జేసుకొని, మునులను హరి భక్తులను బాధించి వధించుచు తన నామస్మరణ చేయమని హింసించు చుండెను.



ఆ॥ పేరుమీద కాంక్ష పెద్దల జెరిచెను
నేర్పడొక్కడైన నీతి, దాన
హరుని ఆత్మలింగ మందిన తనకడ్డు
యుండదంచు దలచె యుర్వియందు

వ॥ విరాగియైన శంకరుడు తనగురించి తపస్సు చేసిన తారకునికి తన పార్థివ లింగాన్ని కూడా యిచ్చివేశాడు.

ఆ॥ విశ్వకర్మ జేర బిలిచిన అసురుడు
శ్రేష్ఠమైన గొలుసు జేయమంచు
జెప్పి దానియందు శివునాత్మలింగంబు
తాపజేసి మెడను తాధరించె

వ॥ ఒకనాడు వేదన నిరాశలతో కృంగిపోయిన దేవేంద్రుడు దేవగురు బృహస్పతిని జేరి వందన మాచరించి

కం॥ సామంతుడైతి 'తారక'
నామమె జపమయ్యె బ్రతుకు నాశనమయ్యెన్
ఓ ముని! తెల్పుము వాడెటు
తా మడియును మాకు నీయ తరగని శాంతిన్



వ॥ బృహస్పతి ఆలోచించి ఇలా అన్నాడు

కం॥ ముక్కంటి వీర్య జనితుడు
నిక్కము తా జంప గలుగు నీచ దనుజునిన్
చిక్కిది కైలాసంబున
మక్కువ ద్వేషంబు లొదలి మనశివుదుండెన్

వ॥ అయితే దక్షయజ్ఞంలో ఆత్మాహుతి జేసుకున్న దాక్షాయణి, నేడు హిమవంతుని ఇంట పార్వతిగా బుట్టి హిమవంతుడు మేనాల గారాబు పట్టిగా పెరుగుతున్నది. ఆమెకు శివునకు సంధానము జేయవలెను.

ఆ॥ షణ్ముఖుడును బుట్టి శంకర గిరిజల
ముద్దు బిడ్డ డగును ముఖ్యుడవుచు
దేవ సేన నడిపి తెగటార్చు తారకున్
దీనికన్న వేరు తెరవు లేదు



వ॥ ఆ విధంగా దేవేంద్రుడు పూనుకొని మన్మధుని ప్రేరేపించి శివుని తపోదీక్ష భంగం గావించి ముక్కంటి మంటలలో బూడిదయై మనోజుడిగా ఆ శివుని కరుణ చేతనే జీవితుడై పరమేశ్వరుని పార్వతిని కలిపి గిరిజా కళ్యాణం జరిపించాడు. శంకర కరుణా కటాక్ష వీక్షణంచే దీక్షితులమై దానిని నాస్వాదించాం.

కం॥ గొనిపోయి ఉమ మహేశుల
తను ఒక దివ్యంబు దోచు తగు సౌధమునన్
బనిపెను నందీశ్వరుడట
గొనకొని కైలాసమందు గొప్ప వినమ్రుడై

వ॥ ఆ దివ్య సౌదం వర్ణనాతీతంగా వున్నది.

సీ॥ పన్నీటిచే తాము పడక గృహంబును
కడిగించిరా శివ గణములంత
కస్తూరి మొదలైన కమనీయ గంధాలు
ఉల్లంబులను దోచె ఉమకు హరుకు

పగడపు మంచాలు తగు హంస తూలికా
తల్పాలు శయనించ తాము వెలసె
జూపు నాకర్షించు సుందర చిత్రాలు
మధుర పదార్థముల్ మంచి తిండ్లు

తే॥ అమరె, కేళికా గృహములు అచట వెలసె
వారి ఏకాంతమును భంగ పరచకుండ
శివగణములు కావలి తాము చేయుచుండ
హరుని కౌగిట కరిగెను తరుణి గిరిజ

తే॥ బిగుతు కౌగిళ్ళు విరహము పెంచు చుండె
తీపి ముద్దులు తాపము దీర్చకుండె
సురతి బంధాల ఉమ హరుల్ కరుగు విధము
సాధ్యమౌనె వర్ణించగ సౌరుతోడ

వ॥ ఆ విధంగా ఆది దంపతులు వెయ్యి వసంతాలు గడిపారు. తారకుని చేత తపించ బడుతున్న దేవేంద్రాది దేవతలకు ఇంకా కుమార సంభవం జరుగదేవని వేదన ఎక్కువయై వారు బ్రహ్మనుజేరి నిష్ఠూరంగా వేదనతో పలికితే వారితో పరమేష్ఠి ఇలా అన్నాడు.



చం॥ తనయులె మీరలైన, మరి దానవులైనను
ఓ సురేంద్ర, నన్
మనసున నిల్పి ఘోర తపమార్గము నెంచుచు
కొల్చు చుందురున్
అనువుగ వారు కోరు వరమందెద రందున
వింతయేమయా
వినుమిది నేను కన్పడక పెంచెదరాయె
తపో కఠోరతన్

వ॥ ఆ తపః ప్రభావంతో వేడిమి పెరిగి లోకాలు దగ్ధమై పోతాయి. మళ్ళీ లోకాలను రక్షించాలి, కాబట్టి భగవంతుడు అవతారాలెత్తాలి. అందుకనే తపస్సు చేసేవారు సన్మార్గులైనా దుర్మార్గులైననూ వారిని నేను ఆదిలోనే అనుగ్రహిస్తాను.

ఆ॥ అసురులైన గాని, ఆ సురులౌగాని
నాకు బేధమేమి లేక యుందు
అడిగి జూతమిపుడె ఆ విష్ణుమూర్తిని
చేయుటేమి ఇపుడు చిక్కు విడగ



వ॥ వారి రాకను జూచి కారణము విని జనార్దనుడు ఇలా అన్నాడు.

కం॥ పురుషుడు క్రీడించుచు తన
తరుణితొ సుఖముండు వేళ తప్పగుజెరుపన్
సురతము సృష్టికి మూలము
ఎరుగరె పాపంబు తగదు ఎవ్వరికైనన్

వ॥ మీరు వేగిర పడకుండ మరొక వేయి వసంతములు వేచి తరువాత కైలాసమునకు బోయి, ఈశ్వరుని వీర్యము అగ్నిహోత్రమందు వైచి దానిచే జనించిన స్కందుడను కుమారుని దేవతల సేనాధిపతిని జేసి తారకునితో తలపడిన ఆతడు అసురుని సంహరించును అని జెప్పి వారిని నెలవులకు బంపించెను. వేయి సంవత్సరాల తరువాత



కం॥ హరుడావేశము బొందుచు
సురతంబున గిరిజ గవయ, చోద్యము కలుగన్
తరిగిన వాయువు నిలిచెను,
పెరిగెను లోకాల పీడ వేదించబడెన్

వ॥ అప్పుడు బ్రహ్మాది దేవతలు, శ్రీహరి కలిసి శివుని జూచుటకు కైలాసమునకేగి నందీశ్వరునిచే అడ్డగించబడిరి.

ఆ॥ అంత సురులు బ్రహ్మ ఆ శివ పార్థివ
లింగమొకటి జేసి లింగరూప
శివుని కొలువ దలచి చేయు విధానంబు
హరిని వేడినారు అందరున్ను

వ॥ మట్టితోనైన, పాదరసంతోనైనా, శిలతోనైన పార్థివ లింగాన్ని జేసి వామహస్తంబున గాని, పుష్ప పత్రములందు గాని, పళ్ళెరమునగాని ఆ లింగము నుంచి పూజించవలెను అని విష్ణువు విశదీకరించెను. అప్పుడు అందరు...

కం॥ జరిపిరి పూజలనావిధి
హరహర మహాదేవ శంభొ అందరి రక్షన్
నెరపుము జగములు గావుము
సురతంబులు జాలు మమ్ము జూడవె కరుణన్

తే॥ హరుడు ప్రత్యక్షమయ్యెను అడిగెనిట్లు
నన్ను ప్రార్థించు టెందుకు విన్నవించ
మనగ, ఈశ్వరా తారకుడంత మవగ
జాగు చేయుట న్యాయమా? తగదు అనిరి

వ॥ ఓ మహాదేవా నీ వీర్య సంజాతుడైన నీ కుమారుడు మాత్రమే తారకుని సంహరించ గలుగును. నీవు కుమార సంభవమునకు సంకల్పించి లోకములకు తారకుని పీడ తప్పింపుము. ఆ మాటలు విని పినాకి సంతసించి తన వీర్యమును అగ్ని హోత్రమున జారవిడెను అంతట



కం॥ తన వీర్యము నా శంభుడు
గొని అగ్నిని వేయజూచి కోపము తోడన్
తను గర్భము దాల్చుట, నా
పిన దేవతలందరిన్ని వెలది శపించెన్

ఆ॥ దేవపత్నులంత నావలె తల్లులు
గాక పోదురెంత గాని అనగ
గిరిజ శాప వార్త హరివిని ఆమెను
ఊరడిల్ల జేసె తరుణినపుడు

వ॥ ఓ పార్వతీ దేవి! తారకాసురుడు లోక కంటకుడై పీడించుచున్నాడు. వాడు శివ వీర్య జనితుడు మరియు తల్లిపాలు త్రాగని, అయోనిజుడు దప్ప వేరెవ్వరిచే జావ రాదని వరము పొందినాడు. అందుజేత మహాదేవుని సమ్మతమున అట్లు జరిగినది గాని వేరు గాదని జెప్పి ఆమెను శాంత పరచెను.



ఆ॥ అగ్నిహోత్రుడంత హర వీర్య తాపంబు
తాళలేక వేడె తాను శివుని
శివుడు తెలిపెనంత స్త్రీ గర్భమును జేరి
వీర్యమపుడు బాయు వేడినంచు

ఆ॥ తాప మగ్నిహోత్రుడాప లేకుండెను
సప్త ఋషుల యొక్క సతుల జూచి
విరహ వేదనంబు పీడించ తనలోనె
దాచి వగచె కాంతి తరుగుచుండ

వ॥ ఆ విషయం గ్రహించిన అతని ధర్మపత్ని స్వాహా దేవి తన దివ్య శక్తితో...

తే॥ మునుల భార్యల రూపంది ముద్దు దీర్చె
ఆ అరుంధతి రూపము అలవిగాక
వదలి తక్కిన భామలై పతిని జేరి
కామ తాపము నటియించె కామినియట



వ॥ నీకు స్త్రీ హత్యా దోషము కలుగును. నా అవస్థ గ్రహించి ఓ అగ్నిదేవా నా కామ తాపము తీర్చుము. నేను ముని పత్నినని సందేహించకుము.

ఆ॥ తిండిలేక యేడ్వ దివ్యమౌ విందు, ల
భించినట్లు, ధనము బిలిచి యిచ్చి
నట్లు, పొలము దానమందిన రీతిగా
అగ్ని సంతసించి అతివ గూడె

వ॥ ఆ విధంగా స్వాహా దేవి తక్కిన ముని పత్నుల వోలె రూపంది అగ్నిని తృప్తి పరచమనగా 'అధికస్య అధికం ఫలం' అనుకొని అగ్ని తను యెరుగకనే తనలోని శంకర దివ్య వీర్యాన్ని ఆ స్వాహాదేవికి ముని పత్నుల పేరున ఆరుసార్లు అందించి అగ్ని తాపశమనం చెందాడు.

తే॥ వీర్యమద్దాని గైకొని వేగలేక
స్వాహ దానిని తరువాత వదలివైచె
శివుని కైలాస పర్వత శిఖరమందు
తాను శాంతించి పతిజేర తరలిపోయె

కం॥ గిరియును వీర్యపు తాపము
భరియించక 'నింగి గంగ' బడవేయగ ఆ
సురగంగ ధరను వేసెను
విరుచుచు ముక్కలుగ శివుని వీర్యము నంతన్

వ॥ ఆ విధంగా అపర్ణకూడా భరింప జాలని శంకరుని దివ్య వీర్యం చిన్న చిన్నవైన ఆరు ముక్కలుగా గంగ ఒడ్డున నున్న రెల్లు గడ్డిలో జేరి చాలా కాలము అచటనే యున్నది. ఒకనాటి మార్గశీర్ష శుద్ధ షష్ఠి, ధనిష్టా నక్షత్రయుక్త వృశ్చికాలగ్నంబున



సీ॥ శివుని వీర్య జనిత శిశువుదయించెను
ఆరు మోములవాడు అర్కసముడు
పదియును రెండైన బాహువుల్ గలవాడు
నానావిధాస్త్రముల్ గొనినవాడు
షణ్ముఖంబుల నుండి చదువుచు వేదాలు
రత్న కిరీటాల రంజితుండు
జపియించు 'ఓం' అంచు జగదేక వీరుండు
వజ్రకాయుండును, బహు సురూపి

తే॥ దేవ దుంధుబుల్ మ్రోగెను దిక్కులదర
వుర్వియందున గురిసెను పుష్ప వృష్టి
నృత్య గానముల్ జేసిరి నాడు దేవ
కాంతలందరు బాలుని చెంతజేరి

వ॥ బాలునికి ఆరు మోములుండుటచే, ఆరుగురు ముని పత్రులుకు అగ్నివలన కలిగిన బిడ్డయే ఇతడని లోకంబుల వదంతి వ్యాపించెను.



ఆ॥ మునులు, పత్నులందు, మోసమనని నమ్మి
వదలివైచినారు భార్యల జత
స్వాహ వారిజేరి జరిగింది జెప్పినన్
లోకనింద వెరచి తాకమనిరి

వ॥ భగవంతుని లీలచే ఆ ఋషి పత్నులు ఆరుగురూ ఆ బాలునికి పాలు త్రాపుమని విధి నిర్దేశించి యుండగా సప్తఋషులు ఆ విధంగా మూర్ఖత్వంతో ప్రవర్తించటం సహజమే.

కం॥ పతులు త్యజించగ పత్నులు
అతి సుందరుడైన బాలు నచ్చట నరయన్
అతిచోద్యమైన విధముగ
అతివలు చనుబాలు చేప అచ్చెరు వాయెన్

వ॥ విచిత్రముగా ఆరుగురు తల్లుల స్తన్యము ఆరు ముఖములచే త్రాగిన స్కందుడు మహా బలశాలి, అతి సుందరుడైన యువకుడై ఆ తల్లుల నానంద బరచెను. వారు వారి ఆవేదనను షణ్ముఖునికి యిట్లు జెప్పిరి.



ఉ॥ నేర మెరుంగమయ్య మము నీచము జేసిరి
మౌని నాధులున్
వారల ఘోర నింద మము పాపుల జేసెను
లోక దృష్టిలో
కోరుచు స్తన్యమిచ్చి నిను గొప్పగ సాకిన
నింద హెచ్చునే
ఆరు ముఖంబులయ్య నిను ఆర్తిని గొల్తుము
దారిజూపుమా

వ॥ దానికి ఆ కుమారస్వామి ఇలా అన్నాడు

కం॥ స్తన్యము నిచ్చిన దల్లిని
అన్యులచే గావనట్టి అతడు సుతుండే?
వన్య మృగంబౌ నిక్కము
అన్యంబౌ చింత వలదు అమ్మల గాతున్

వ॥ వారు కుమారుని రక్షలో అచ్చటనే యుండిరి. అంత బ్రహ్మ ఒక శుభ ముహూర్తమున అతనికి కుమార స్వామియని నామకరణం జేసెను. అతనికి పెక్కు వ్యవహార నామములు కలిగినవి. స్కందుడు, షణ్ముఖుడు, గాంగేయుడు, కార్తికేయుడు, అగ్నిపుత్రుడు, శరజన్ముడు, బహు వేగుడు, గుహుడు, సుబ్రహ్మణ్యుడు, పార్వతీ నందనుడు మొదలగు పెక్కు నామములు కలిగెను.

తే॥ అయ్యె నెమలి వాహనముగా అగ్ని సుతుకు
సుందరాకారుడయ్యెను చూపు ద్రిప్ప
లేరు, ఠీవితో అలరారె సురులు జూచి
వీడె తారకాంతము జేయు వీరుడనిరి

ఆ॥ వెండి కొండపైన వేటాడ బోయెను
ఆ కుమారుడంత అచటనున్న
సింగములను పులులు చెవిబట్టి ఆడించె
వెరపులేక వాని బెదర గొట్టి



ఆ॥ శివుని రక్షనున్న శివధనుస్సును యెత్తి
బాణమెక్కు వెట్టి పర్వతగిరి
క్రౌంచమనెడి దాని ఖండించె 'బహువేగి'
క్రౌంచధారుడనగ గౌరవమున.

వ॥ అంతట క్రౌంచ పర్వతమున నున్న రాక్షసులు వేల సంఖ్యలో అతనిని ముట్టడించగా

కం॥ వదలడు యొక్కని నైనన్
చెదిరిన రాక్షసుల బట్టి ఛేదించంగన్
ఇది విని దేవేంద్రుండును
కదలెను 'వజ్రము' ను యెత్తి కసితో గొట్టెన్

వ॥ అరిషడ్వర్గముల బానిసలు రాక్షసులే కాదు దేవతలు కూడాయను దానికి యిదే తార్కాణము. కుమార సంభవమునకు మన్మధుని కూడ చెడగొట్టిన దేవేంద్రుడే ఆ కుమారుని అన్యునిగా తలచి పోరాడుతున్నాడు.



తే॥ అగ్నిపుత్రుని గొట్టిన ఆయుధమ్ము
వజ్రమైనను దానికి 'వాడి' బోయి
వ్యర్థమాయెను స్కందుగాయంబు నుండి
ముగ్గురతివీరులున్ బుట్టి

వ॥ తండ్రీ! మాపేర్లు విశాఖుడు, శాఖుడు, నైగమాఖ్యుడు నీ రక్తము కళ్ళజూచిన ఆ సురేంద్రుని పట్టి తెచ్చెదము. అన్నంత పనిజేశారు. కాళ్ళపైబడ్డ సురపతిని జూచి,

కం॥ ఎంతటి అవి వేకివి, నీ
కింతయు జ్ఞానంబులేదు ఈశుడు గిరిజన్
సంతోషముతో కూడగ
పంతంబున జేసి కూడ మఱచితి వౌరా!

వ॥ దేవేంద్రుడు వెంటనే కుమారుని క్షమవేడి గాయానికి ఉపశమనం జేసి వెడలిపోయాడు.



తే॥ హరుడు గిరిజయు గణముల నన్ని బిలిచి
సభను నెరపంగ ముక్కంటి చనువు జూపి
నంది నడిగెను ఆయెడ నయము మీర
వాయు వేగాన విష్ణుని బ్రహ్మ బిలువ

తే॥ వీరభద్రుని ముక్కంటి బిలువనంపి
గంగతీరము నందున్న స్కందుదెమ్ము
అనగ పుష్పక మెక్కిన యాతడపుడు
మునుల పత్నులతో బాలుగొనుచుబోయె

వ॥ అదే విధంగా నంది సురేంద్రుని, సుర శ్రేష్ఠులను సప్త ఋషులను నారదాది మునులను తీసుకుని కైలాసం చేర్చాడు.

కం॥ చేరెను మాతా పితరుల
మీరిన ఆనందమంది మేలుగ స్కందున్
వారలు హరిబ్రహ్మేంద్రుల
కోరిరి ఆశీర్వదించ కొడుకతనంచున్

వ॥ అప్పుడు దేవేంద్రుడు ఆహా! షష్ఠినాడు బుట్టి సప్తమినాడు పెరిగి పెద్దవాడై వన విహారంజేసి, అష్టమినాడు క్రౌంచ పర్వతమును ఖండించి, నవమినాడు రాక్షస సంహారంజేసి, దశమినాడు నావజ్రాయుధాన్ని మొక్కపోవునట్లు జేసి తన రుధిర జనితులైన శాఖ, విశాఖ, నైగమాఖ్యులచే నన్ను పారునట్లు చేసిన ఇతడు తప్పక ఆ తారకదమనానికి శివవీర్య జనితుడు కాక ఇంకెవరు? అని తలచి వినమ్రుడై మ్రొక్కాడు. అప్పుడు శివ పార్వతులు సంతసించి,

తే॥ రేపు ఏకాదశమినాడు ఈ పురుషుని
దేవసేనను కన్యను దెచ్చి పెండ్లి
జేసి దేవ సైన్యపు నేతజేసి వీని
తారకుని జంప బంపుట తగును అనిరి

కం॥ సంతోషంబున అవునని
అంతట స్కందునకు వడుగు ఆపై బెండ్లిన్
ఎంతో వేడుక జరిపిరి
కంతుని దమనుండు గిరిజ ఘనమగు రీతిన్



ఆ॥ బిలిచి విశ్వకర్మ దెలిపెను పాకారి
మేలు భవన మొకటి కలుగజేయ
క్రొత్త వధువు వరుడు కూడిరి దానిలో
కూర్మి కాపురంబు కూడి సలుప

వ॥ అప్పుడు పరమేశ్వరుడు కార్తికేయునితో ఇలా అన్నాడు.

చం॥ సలుపుము దుష్ట శిక్షణను స్కందుడ వైయిక ఓ కుమారకా
నిలుపుము శిష్టులన్ తమకు నీవొక రక్షకు డంచు నమ్ముచున్
కొలువగ దేవతల్ తమరు కోరిన నాయకు డుత్తముండనన్
చెలువము తోడనందరికి సేమము గూర్చుము పేరు నిల్పుమా



మ॥ వరగర్వంబున తారకుండు అవనిన్ బాధించి సన్మార్గులన్
సురులన్ పారగ జేసి స్వర్గ నగరిన్ సొంపార జేబట్టి, ఆ
పరమేష్ఠిన్ విని యొప్పగించెనటుపై ప్రాప్తించ దివ్యంబుగా
హరునాత్మన్ గల లింగ ధారియవుచున్ ఆతండు ఉద్దండుడౌ

కం॥ హర వీర్యంబున బుట్టిన
వరపుత్రుని జేతగాక పరులతొ తనకున్
మరణము గారాదనియెడి
పరమేష్ఠి తనిచ్చినట్టి వరబలుడతడున్

ఆ॥ వాని వరములన్ని వ్యర్థమౌ నీచేత
సేన నడపవయ్య సేన పతిగ
లోక కంటకుండు చేకొను మరణము
నీదు జేతిలోనె నిజము స్కంద!



వ॥ అప్పుడు పార్వతీదేవి ఇలా అన్నది

ఆ॥ నీకు జన్మనీయ నాకవకాశంబు
లేకబోయె హరుని లీల, గాని
జరుగ నున్నదంచు జగతి కళ్యాణంబు
నే భరించినాను నీదు లోటు

కం॥ సురులను నడుపుము గెలుపుకు
వరముల గర్విష్టియైన పాపిని దునుమో
హరపుత్ర తారకాసుర
మరణానికి బాటవేయ మా ఆకాంక్షౌ

వ॥ లోకమాత అట్లా చెప్పగానే పెక్కు దివ్యాస్త్రములు కార్తికేయుని కైవశమయ్యాయి.

ఆ॥ గిరిజ సప్తఋషుల కెరిగించె నీరీతి
సతుల వీడతగునె సజ్జనులకు?
స్వీకరించు డిపుడె స్త్రీలను మునులార
స్వచ్ఛ శీలలయ్య సచ్చరితలు

వ॥ ఆరుగురు ఋషులు వెంటనే తమ భార్యలను సంతోషంగా ఆదరంతో స్వీకరించారు.

తే॥ సుతుడు ముద్దాడు శంకరున్ మాత నపుడు
వీడుకోలును దెలుపుచు వెడలినాడు
లక్ష్మి శ్రీహరి, బ్రహ్మ సరస్వతులును
వారి నెలవులకందరు తరలినారు

వ॥ ఇక్కడ శోణిత పురంలో తన యోధులతో మంత్రులతో తారకుడు,

ఉ॥ చారుల వల్ల నేర్చితను శంకరనందను యుద్ధ
యత్నముల్
మీరిన క్రోధమెక్కి గతిమించిన తామసుడై
తనిట్లనెన్
ఊరక చింతయేల మనకుండగ శంకరు
నాత్మలింగమో
వీర వరేణ్యులార హరు వేడిన జాలదె వీడు
లెక్కయా?



వ॥ ఆ దుష్టుడి భజన పరులంతా ఔనన్నారు వేదోక్తంగా శివుని పార్థివ లింగమును పంచ బిల్వముల తోను, పంచామృతాలతోనూ, పంచాగ్నుల మధ్య బూజించి తీర్థ ప్రసాదములు తీసుకొని....

కం॥ తెలిసియొ తెలియకొ ఓ శివ!
నిలిపితి నిన్నాత్మయందు నీదాసుడనై
గొలువక నన్యుల నిలిచితి
తొలగింపుము 'దుష్ట బాధ' తొందరగ ప్రభూ!

వ॥ పరమాత్మ ఎంత టక్కరి వాడంటే 'తొలగింపుము దుష్ట బాధ' అనే కోరికను నిన్నే తొలగించి తీరుస్తాను అంటాడు. ఏది ఏమయినా నీ పలుకులు నిజమయ్యాయి కదా, అంటాడు. తను తీసుకున్న గోతిలో తనే పడడం అంటే అదే. భస్మాసురుడుకి అదే గదా జరిగింది.



తే॥ శుభ శకునములనట జూచి శోణితపురి
ముట్టడించగ సేనల జట్టుజేసి
దేవగురు బృహస్పతి వెట్టు దివ్యమైన
శుభ ముహూర్తాన వెడలెను సురులసేన

వ॥ శోణితపురి జేరిన సుబ్రహ్మణ్యుడు సేనల జూచి ఓ దేవతలారా.....

ఆ॥ సామ దాన భేదమన్ మంచి యుక్తులు
గాక దండ నొకటె ఘనులెరుంగు
నవి, వినంగ, కాని కోవిదులకు 'తాళి'
వేచియుంట కూడ వింత యుక్తి

వ॥ వీటన్నిటిలోనూ సామమే కడుంగడు శ్రేష్ఠమైనది రాయబారము బంపి రణమునాపుట ఉత్తమము. అనగా దేవేంద్రుడంగీకరించి తారకుడు స్వర్గమును పూర్తిగా దేవతల ఏలుబడికి ఒప్పగించి శోణితపురము విడిచి వాని భోగవతీ పురమునుక బోయి సద్బుద్ధితో వుంటే తనకూ సంధి అంగీకారమే అన్నాడు.



కం॥ జూడ విశాఖుని మించిన
వాడెవడా రాయబార బాధ్యత బూనన్
నేడే వానిని బంపిన
కూడును పని శాంతి వెలయు గోర్కెలు దీరున్

వ॥ ఆ విధంగా విశాఖుడు దూతయై తారకుని జేరి ఇలా అన్నాడు.

తే॥ శివుని కొమరుడు స్కందుడు శ్రేష్ఠుడతడు
వానిబిడ్డ విశాఖుడ నేను జెప్పు
మాట వినుమయ్య రణమును మానుమయ్య
ఆధిపత్యము సురులపై 'అంత' మీయు

వ॥ తక్షణమే శోణితపురి సురేంద్రునకు ఒప్పగించి నీ భోగవతీ పురమునకు బోయి దానిని పాలించు కొనుము. బ్రాహ్మణులనూ, మునులనూ ఆదరించి సద్బుద్ధితో నుండుము.

కం॥ అటుగానిచొ నేనొల్లను
స్ఫుటముగ నిను జంపి నేను శోణితపురమున్
ఇట యీ సురపతి కిచ్చెద
నిటలాక్షుడు యెత్తి వచ్చి నినుగాచిననున్

వ॥ ఆ మాటలకు తారకుడు ఆగ్రహోదగ్రుడై హూంకరించి, ఆపై తనని తను సంబాళించుకొని

తే॥ నేను స్కందునిపై యేమి కినుక గొనను
శివుని పుత్రుడు నాకును దేవుడె గద!
నాకు పాకారి శత్రువు నమ్మనతని
పోరు తప్పదు బహువేగి జేరవాని

వ॥ విసిగి పోయిన విశాఖుడు వెడలిపోయాడు. అప్పుడు తారకుడు



ఆ॥ మంత్రివర్యులార! మన్నించి నామాట
సంధి జరుప తగిన సమయ మిదియ
తెలుపరయ్యానాకు దేనికిన్ వెనుకాడ
వీరస్వర్గమైన బెదురులేదు.

వ॥ ఆ విధంగా నిశ్చయించి అసురులంతా యుద్ధ సన్నద్ధులైనారు.

ఆ॥ సంధి చెడినదంచు జరిగిన సంగతి
ఆ విశాఖుడంత జెవిని వేయ
దేవసేన పతియు దీర్చె నాతని సేన
యుద్ధవార్త దెలిపి యుర్వియందు

వ॥ సామాన్య జనావళి జాగరూకులై యుండుటకు ఆ విధంగా దండోరా వేయించి సామాన్య జనపద ములను, మునిపల్లెలను, ఆటవికులను హెచ్చరించడం ధర్మం.



కం॥ తారకుడు పద్మవ్యూహము
ప్రారంభపు యెత్తువేసె బలముల కోరెన్
బోరగ శివసుతు వెరువక
కూరిమి ఆ శంకరుండె గొప్పగ రక్షొ

వ॥ ధర్మయుద్ధమెలా జరిగిందంటే....

సీ॥ రథ సేన బోరెను రథసేన నెదిరించి
కాల్బటుల్ బోరిరి కాల్బటులను,
గజసేన నెదిరించె గజసేన మాత్రమే
అశ్వసేనను బోరె అశ్వసేన
అర్ధ రథుడుబోరు అర్ధరథున్గాని
తనకన్న బలహీను తగులుకొనడు
ఆయుధహీనుడౌ యాతని బోరడు
ఆయుధ పాణి యేమయిన గాని



తే॥ సూర్యుడుదయించి కాంతులు జూపకుండ
యుద్ధమారంభమే కాదు ఉన్నతముగ
సూర్యుడుంకిన దిక్కులు జూపకుండ
యుద్ధమాపుదురెన్నైన యోధులంత

వ॥ అట్లు పటిష్టమైన మార్గదర్శక సూత్రములతో యుద్ధమారంభమై తారకునితో దేవేంద్రుడు, బాణునితో అగ్నిదేవుడు, ప్రలంబునితో కుమారస్వామి తలబడి శస్త్రాస్త్రములుపయోగించి యుద్ధం చేశారు. అంతలో సూర్యాస్తమయం అయింది. అదెలా వుందంటే....

తే॥ సూర్యుడెంతకూ రాదని జూచి కినిసి
ఎర్ర బారిన యాతని యింతులట్లు
దిక్కులెర్రవారెను వారు దీనిజూచి
యుద్ధమాపిరి ఇరుసేనలుచిత రీతి

వ॥ ఆరాత్రి ఇరుసేనలు విశ్రాంతి తీసుకుని నిద్రలేచి అనుష్ఠానాదులు పూర్తిచేసుకొని మళ్ళీ రెండవరోజు యుద్ధానికి సిద్ధమయ్యాయి. ఆ సూర్యోదయం ఎలా వుందంటే.....

తే॥ పెద్ద ముత్తైదువ నుదుట బెట్టి నట్టి
ఎఱ్ఱ కుంకుమ బొట్టులా యెల్లరకును
దోచె సూర్యుడు, బంగారు తునక వోలె
జ్వలిత గోళమై దిక్కులు వెలుగ జేసె

వ॥ ఆరోజు కుమారస్వామి తనసేన సిద్ధమై యుండగా పద్మవ్యూహం పన్ని తన సేనతో శత్రువుల నెదిరించాడు. అటువైపు తారకుడు, బాణుడు, ప్రలంబుడు మొదలైన వారితో తను చక్రవ్యూహం పన్ని కుమారుని యెదిరించాడు. దానిని జూచిన స్కందుడు...



ఆ॥ దేవగణములార ధీరోచితము మీకు
జెప్పుచుంటి వినుడు ముప్పులేదు
మీకు దగ్గ యోధ మీరెన్ను కొని పోరి
మీరు జయము గాంచుడెరుగ ఘనత

వ॥ ఆరోజు కుమారస్వామి ప్రలంబునితో తలపడగా తారకునితో వీరభద్రుడు తలపడ్డాడు. ద్వంద్వ యుద్ధము అతి తీవ్రంగా జరిగింది.

సీ॥ తొండముల్ తెగిపడి యుండె గజేంద్రముల్
హయములు కుంటివై అలమటించె
విరిగిన చక్రాల నొరిగెను రథములు
మొండెముల్ కుప్పయై 'కొండ' ద్రోచె
ఏరులై రుధిరంబు పారెను యెల్లెడన్
ఆర్తనాదాలతో అవని మ్రోగె
కాకుల్, ఉలూకముల్, గ్రద్దలు గుమిగూడె
రాబందులకు విందులాగ ద్రోచె



తే॥ దైత్య మూకలు ఓడ, వీగనాదిత్యులున్ను,
సురులు యోడిన కేకల్ అసురులు వేయ
హోరులెత్తెను రణభూమి యోధులంత
పోరు సల్పిరి బెదరక పుడమియందు

వ॥ ఆ విధంగా ఘోరమైన పోరు జరిగింది. సూర్యుడు అస్తమించగా కదనం నిలువరించబడింది. విసిగిపోయిన దేవతలు ఆ రాత్రి కార్తికేయుని జేరి ఇట్లనిరి.

చం॥ అలసిన వారమయ్య ఇక అద్రిజ నందన! పోరలేము, మా
పులిసిన దేహముల్ నలిగిపోయెను మాకిక ఆశలేదయా
గెలుతుమొ చెప్పలేము, మరి కీర్తిని పొందెద మన్న సాధ్యమా
నిలుపుము మాదు ప్రాణముల నీవిక తారకు ద్రుంచుమో ప్రభూ!



వ॥ దానికి షణ్ముఖుడిలా అన్నాడు....

కం॥ వెరపును మానుము నీవిక
సురనాయక! చింతవీడి చొక్కుము శాంతిన్
అరుగుడు విశ్రాంతిని గొన
పరిమార్చెద దానవేశు పాశుపతముచే

వ॥ అంత సూర్యోదయం కాగానే షణ్ముఖుడు త్రేతాగ్నులను యొక్కసారే ప్రజ్వరిల్లజేసి దగ్ధమైన సతి మరణ వార్త విన్న కాలరుద్రునివలె విజృంభించి రాక్షసులను అగ్నిలో బడ్డ శలభాలవలె మారణ కాండ జరుపుతున్నాడు.

ఆ॥ కాళ్ళు వణక సాగె, కన్నుల జీకట్లు
క్రమ్మె, ప్రాణభీతి కలుగ దనుజు
లంత తారకునికి అల్లాడి జెప్పిరి
బ్రతుకు ఆశ లేదు జేతుమేమి

వ॥ వారి నోదార్చి తారకుడిలా అన్నాడు

సీ॥ భీతిల్లి ప్రాణాలు పిడికిట బట్టుచు
శత్రుల గనిపారి చవటలట్లు
బ్రతుకు కన్నన్ పోరి వదలుచు ప్రాణమున్
వీరస్వర్గమునంద పేరు రాదె?
పుట్టిన ప్రతివాడు గిట్టుట తప్పదు
చావుకేల వెరపు చావె నిజము
పౌరుషంబును, కీర్తి బడయగ జ్ఞానంబు
ఒక్క ఘడియ మేలు యోధ బ్రతుకు

ఆ॥ దాన, మీరు చింత దరిజేర నీకుండ
పోరు సలుపుడయ్య వీరులార
దేవగణములన్ని దీనితో సరియను
రీతి జంపగలను భీతి వలదు

వ॥ మళ్ళీ ఘోరమైన పోరు జరిగి సురులు తరిగిపో సాగిరి. దేవతలు స్కందుని జేరి కుమారా! వేయి సంవత్సరాలనుంచి యుద్ధం జేస్తున్నాం.



కం॥ ఈక్షణము నీవు వాని, యు
పేక్షను జేయంగబోకు వీరకుమారా!
శిక్షగ సురులంత మవన్
కుక్షీవలయంబు గెల్చికూడ నయంబే?

వ॥ దానికి గాంగేయుడిలా అన్నాడు

మ॥ ఇదిగో పాశుపతంబు మీరలిక నాయీ
మాటలన్ దాల్చుడీ
ముదమున్ శాంతిని పొందుడయ్య దనుజుల్
మూకౌచు క్షీణించగా
అది జేకూర్చును చావువేరి కెటులో
ఆ తీరుగా, పోరినన్,
కుదురన్ దానికి, వందనంబు నిడుచున్,
గొల్వంగ వీడున్, అరిన్

వ॥ కావున ఇది శత్రు పరాజయం చేకూరుస్తుంది. కానీ ఈ పాశుపతం, నారాయణాస్త్రమువలె వంగి నమస్క రించినా, పారిపోయినా శరణన్నా ఏమీ చేయదు.



కం॥ కనుకనె దీని నసురుపై
వెనుకాడితి నేను వేయ వేల్పుల్లారా
వెను దిరుగుచు పారినచో
తను అరి ప్రాణాలు దీక దయజూపునయా

వ॥ ఇప్పుడు అదే జరిగింది, అని, నాటికి యుద్ధం చాలించి, గంగా స్నానంచేసి విశ్రమించాడు. దేవతలు కూడా ఒక ధర్మసూక్ష్మం తెలుసుకున్నారు. శంకరుడు, నారాయణుడు దుర్మార్గాన్ని చంపుతారు కాని దుర్మార్గులని కాదు. భగవంతునికి తారకుని రాక్షస ప్రవర్తనమీదే కాని తారకునిపై ఏకోపం లేదు.

ఆ॥ శరణు వేడినంత శత్రువునైనను
జంపరాదు అనెడి చక్కనైన
సూక్తి జెప్పువారు సురులౌ అసురులైన
ఘనులు దైవసములు గారె దెలియ

వ॥ ఆరాత్రి తారకునికి కాళరాత్రి అయింది



సీ॥ దుఃఖించు నొకపరి తొడగొట్టు నొకపరి
వేదాంతిగా మారు వెరపు మాని
రక్తాభిషేకంబులను రుద్రునకు జేయు
పంచాక్షరీ మంత్ర పఠన జేయు
అశరీర వాణిచే అంత్యకాలపు వార్త
విని విచారము మాని వేడె శివుని
ముక్తినీయుము శివా ముల్లోకముల నేలి
నాను, నీదయజేత ఘనత నీద

తే॥ నేను పూజించు పార్థివ లింగ మిదియె
దీనిలోక పూజితమవన్ దీవెనిమ్ము
కోరి ఈరీతి శయనించె తారకుండు
మనసులో 'గ్లాని' అంతమై గనెను శాంతి

వ॥ మరునాటి ఉదయం యుద్ధం ఆరంభం కాగానే శ్యాన వ్యూహంతో స్కందుడు తారకుని ఎదుర్కున్నాడు.

ఆ॥ పిన్నవాడ వంచు విశ్వేశ్వరుని చూలి
వంచుతలచి నీకు అణగియుంటి
నేడు సైపబోను నిన్ను ఓ షణ్ముఖా!
మనలో ఒకడె మిగులు వినుము నిజము

వ॥ దానికి షణ్ముఖుడు అట్లే యగుగాక అని పెక్కు శస్త్రాస్త్రాలతో తారకు నెదిరించెను. ముమ్మందుగా గొప్ప మాయా నిర్మితమైన మహాశక్తిని తారకుడు స్కందునిపై ప్రయోగించాడు. అది

కం॥ బాలుని వేదించెను అది
కాలాడదు చేయిరాదు కటకట జెందెన్
మేలగు బ్రహ్మాస్త్రంబున్
కోలకు సంధించి వైచె కొమరుడు యంతన్

వ॥ ఆగ్రహోదగ్రుడై తారకుడు వానికి దీటుగా సుబ్రహ్మణ్యునిపై శక్తిని వేశాడు. వారిరువురూ



వాయువ్యస్త్రంతో వారుణాస్త్రాన్నీ నాగాస్త్రం, గారుడాస్త్రం, మయాస్త్రం, వజ్రాస్త్రం ప్రయోగించుకొని ఒకరిది ఇంకొకరు ఖండించగా నిరుత్తరులై నిలబడిపోయారు.

కం॥ ఇరువది ఒక్కదినంబులు
గిరిజా సుతుడట్లు పోరి గెలువ దలచియున్
అరయక విజయము తాననె
సురనాయక! వీని దునుమ జూడమి దేమో?

ఉ॥ నారదుడేగుదెంచి, గని, నమ్రత మ్రొక్కిన స్కందు కిట్లనెన్
తారకు జంప బుట్టితివి తల్లులు ఆర్గురు స్తన్యమిచ్చిరే
తీరుగ ఈ సురోత్తములదీటగు నాయకుడీవె ఓ గుహా!
జేరి ధరింపుమయ్య యిటు జెప్పెడి మాటలు సావధానుడై



వ॥ శివవీర్య జనితుడవైన నీవు దక్క అన్యులు ఈ తారకుని జంపలేరు. నిన్నేవీడు తిప్పలు పెడుతున్నాడు. ఇది వీని ఆత్మలింగం యొక్క ప్రభావమే సుమా. దానిని వాడు నిత్యమూ నమక చమకాలు చదువుతూ రక్తం, పుష్పం, క్షీరం, నారికేళనీరం, దధ్యాదులతో అభిషేకిస్తాడు.

తే॥ హరి అలంకార ప్రియుడట, హరుడు తాను
ప్రియుడు అభిషేకమునకును, వినగ రవియు
తాను గోరు ప్రణామముల్ దండములను
విప్రుడీ యిల భోజన ప్రియుడు జుమ్మి

వ॥ అదియును గాక శివునకు భార్యా పుత్రుల కంటే భక్తుల మీదే అనురాగం ఎక్కువ. తారకునికి ధూర్జటి అండ యున్నంత కాలం వాణ్ణి నిర్జించుట సాధ్యంకాదు.



సీ॥ అగ్నినేత్రుని దల్చి ఆగ్నేయ అస్త్రంబు
వైచి దనుజు జంప వలయు, నట్లు
ఐదు ముక్కలువోలె ఆత్మలింగము గొట్టి
పడు ముక్కలను గొని పరమ భక్తి
గొని ప్రతిష్ఠను జేసి గుళ్ళను గట్టించి
పూజాధికంబులు పూన్చవలెను
లేనిచో అవియొక లింగమ్ముగా మారి
తారకు మెడజేరు, తక్షణంబె

తే॥ కాన ఆ ఖండముల బూని ఘనత నొప్ప
నీవు జేయించి స్థాపన నేర్పుతోటి
బెట్టి బ్రహ్మాస్త్రమును వింటు సాటివాని
లోక కళ్యాణ మొనరించ నీకె తగును

వ॥ నారదుడు చెప్పింది శాస్త్ర సమ్మతమని దేవతలు, మునులు షణ్ముఖునికి విలోకించి జెప్పగానే స్కందుడు సూర్యుని జూచి....

కం॥ వేగమున నీవె ఘనుడవు
ఆ గడుసరి విశ్వకర్మ అన్నియు జేయున్
చేగొని వాని సహాయము
ఆ గుళ్ళను క్షణములోన అవని నిలుపుమా

వ॥ అనిన వెంటనే మునులు ఆ మహా లింగములకు పూజలు ప్రారంభిస్తారు. నేను తారకుని బ్రహ్మాస్త్రముచే సంహరించెదను. ఈ వ్యూహం ఇలా జరుగుతుండగా అక్కడ తారకుడు.

తే॥ వినుడు నామాట దానవ వీరులార
సురుల నంతము జేతును జూడరయ్య
జయము తధ్యము వలదయ్య జంకు మీకు
హరిహరాదులు తామొచ్చి పోరిగాని

వ॥ ఆ రణరంగంలో తారకుడు తొలు దొలుతనే స్కందుని ఢీకొని ఈ విధంగా అన్నాడు.



చం॥ హరునికి ముద్దుబిడ్డవని, అందరి మాటలు
లెక్కజేయకన్
దురితములన్ని సై చితిని తొల్లి సెమించితి
నేనుగాని నన్
పిరికిగ నెంచి పోరెదవు విజ్ఞత లేదొకా
కార్తికేయ, నీ
వెరుగవు ఈశ్వరుండు తనప్రేమతొ
నెంచును భక్తునొక్కనే

వ॥ అని పలుకుచూ మహేశ్వరాస్త్రంతో బహువేగుని రథంపైన మూర్ఛబోవునట్లు కొట్టాడు రథచోదకుడు రథాన్ని తెలివిగా దారి మళ్ళించగా దేవతలు హాహాకారాలు జేశారు.

కం॥ దానవ వీరుల్లారా
నే నిలబెట్టితిని మాట నే నొసగినదొ
కానిందు మూర్ఛ దేలిన
వీనిని యముదరికి బంపి విందొనరింతున్



వ॥ అనిజెప్పి తారకుడు వేచియున్నాడు. అప్పుడు మూర్ఛ దేలి పారిపోయిన తన సేనలను జూచి బహువేగుడు ఇలా అన్నాడు.

కం॥ ధర్మము నెగ్గక వినుడు, అ
ధర్మము తను రాజ్యమేలి దహియించు నెడన్
మర్మము దీని నెరుంగుడు
ధర్మము తుదినైన గాని తప్పక గెలుచున్

వ॥ అప్పుడు త్రిమూర్తులు ప్రత్యక్షమై

ఆ॥ జాగు చేయనేల షణ్ముఖా! దనజుని
దునుము తక్షణంబె తొల్లి నీకు
నారదుండు జెప్పు నయమైన మాటలు
దలచి జంపుమయ్య దనుజు నిపుడె



వ॥ దానికి షణ్ముఖుడు అంగీకరించి, తొల్లి తాము ఆలోచించిన ప్రకారం సూర్యుని, విశ్వకర్మను హెచ్చరించి శివ గణాధిపతులను సిద్ధ పరచి ఉండమని నియమించి, దేవేంద్రాదులును యుద్ధమునకు సిద్ధమయ్యారు. అప్పుడు తారకుని జూచిన స్కందుడిలా అన్నాడు.

తే॥ సాధు జనులకు తారకా! బాధవెట్టి
గర్వ మదముల లోకాల కంటినీరు
పెట్టు రీతిని పీడించి వేల్పు లెల్ల
శ్రమలు పొందగా జేసిన తామసుడవు

వ॥ నిన్ను తప్పక శిక్షింతు ననగా తారకుడు...

ఆ॥ మరల మరల నీకు మన్నింపు నిచ్చితిన్
మానవేల నీదు మంకుతనము
చివరిసారి నీకు జెప్పు చుంటిని, నాకు
శరణువేడు జేతు స్వర్గపతిని

కం॥ గిరిజకు శోకము నీయకు
హరునకు ప్రియ సుతుడవీవు అనిమేషులకున్
వరసైన్యాధ్యక్షుడవా
సురపతివై నాకమేలు సొంపుగ స్కందా!

వ॥ ఆ మాటలకు భగ్గునమండి పడి కుమార స్వామి,

సీ॥ క్షణమైన చేయక జాగును బహువేగి
ఆగ్నేయ అస్త్రమున్ అపుడు వైచె
ఆత్మలింగము గొట్టె అయిదు ముక్కలు ఆయె
దూరాన పడజేసె, తొందర పడి
వాటిని సూర్యుడు భక్తి ప్రతిష్ఠించె
విశ్వకర్మాలయాల్ వెలయజేసె
వీరభద్రాదులు సురులును మునులును
పూజలు జేసిరి పూని భక్తి

తే॥ 'బ్రహ్మ శరమును' సంధించి పరమ శివుని
దలచి స్కందుడు గొట్టెను దనుజపతిని
మేరునగమట్లు గూలెను తారకుండు
పుష్ప వర్షంబు గురిసెను పుడమియందు



వ॥ ఇక ఆ అయిదు లింగములు జగత్ప్రసిద్ధములు ఎలా అయ్యాయంటే....

తే॥ పడెను ఓంకార నాదము పలుకుచుండి
ఐదు లింగము లవనిపై అందుచేత
పంచ ఆరామములు యని అంచు భువిని
పేరు పొందెను కొలిచిరి వేల్పు లెల్ల

తే॥ భీమలింగేశ్వరములంచు పేరు పొందె
విశ్వకర్మయు భానుడున్ వేల్పులంత
జేరి ఆలయ స్థాపన జేసినారు
ఒక్క తీరుగ లింగముల్ యొప్పియుండ

వ॥ పంచారామాలని కూడా అవి ఖ్యాతి పొందాయి. వాటి యుత్పత్తికి కారకుడైన తారకుడు శివసాయుజం జెందగానే ముక్కోటి దేవతలు, ముజ్జగములు ముప్పిరిగొన్న ఆనందముతో, పండుగ జరుపు కున్నారు.



కార్తికేయుని ఘనముగా పూజించి మ్రొక్కి ఘనమైన కానుకలు సమర్పించారు. త్రిమూర్తులు అంతులేని ప్రేమతో పెక్కు వరములిచ్చారు. మహా ఋషులు దీవించిరి. గంధర్వులు కీర్తించారు. నృత్య గాన, స్తోత్రాలతో అందరూ ప్రస్తుతించారు. మిగిలిన అసురులు శరణు వేడి శివారాధకులయ్యారు.

కం॥ తమ తమ తావులకేగిరి
విమలుండగు కార్తికేయు వేవేనోళ్ళన్
మము గాచు వేల్పు యీతడు
ఉమ పుత్రుడు పొగడుడితని ఉన్నతుడంచున్

వ॥ దేవసేన పతిభక్తితో కుమార స్వామిని గొల్చుచుండగా కొన్నాళ్ళకు సుబ్రహ్మణ్యుడు భిల్ల కన్య వల్లిని పరిణయమాడిన గాధ అతి మనోహరం. అది యెట్టిదనిన...



ఉ॥ దానవ శ్రేష్ఠు జంపి తన ధర్మము దీర్చిన
కార్తికేయుడున్
మానసమందు శాంతి గొనమాత ఉమన్ పిత
శంకరున్ గనన్
బూనుచు జేరె వారికడ వుండెను ప్రీతిగ
కొన్నినాళ్ళు, అ
వ్యానికి అద్వితీయమగు భార్యలభించెను
తా ద్వితీయమై

వ॥ హృద్యమైన ఆ కథ యెట్టి దనిన....

కం॥ తను జనె వాహ్యాళికి యా
ఘనుడగు స్కందుండు వాని కలియగ జేరెన్
మనసున ప్రేమాదరములు
పెన వైచిన నారదుండు ప్రియముగ బలికెన్

తే॥ బ్రహ్మ మానస పుత్రులు, పద్మనాభు
ప్రియులు, ముల్లోక పూజ్యులు, మీదురాక
కారణంబేమి? ఊరకే రారు ఘనులు
తాము అన్యుల జూడగ తలవ బోరు.

వ॥ నారదుడు ఆనందంగా ఇలా అన్నాడు,

ఉ॥ తారకుడంతమై వెలసె ధాత్రిని జీవుల
శాంతి సౌఖ్యముల్
మీరక ధర్మమున్ ప్రజలు మేలుగ సల్పిరి
పుణ్య కార్యముల్
పేరుకు నైన ద్వేషములు వెర్రి దురాత్ముల పీడ
జూడగా
నేరరు, శిష్టులై మదిని నీతిని దప్పరు
దైవ చింతనన్

వ॥ ఇది ఇట్లుండగా నీకు మాత్రమే జెప్పదగిన ఒక మాట ఉన్నది. అది జెప్పుటకే వచ్చితిని.

ఆ॥ కలదు భిల్లపురముగా పేరు నొందిన
గ్రామ మొకటి అచట, రాజధాని



దాని రాజుపేరు వినుము పుళిందుడు
శైవ భక్తుడయ్యు సంతులేదు

ఆ॥ పరమ శివుని లీలలరయ నసాధ్యంబు
దైవ ఘటన జేత, 'శివుడు' యనెడి
యోగి జూచి గవయు మృగ మిథునమ్మును
స్ఖలనమాయె, మనసు సంచలించి

వ॥ ఆ మహాముని జరిగిన దానికి చింతించి, ఆ వీర్యమును పచ్చికయందు జార విడిచి తన దారిన బోయెను. ఒక ఆడ జింక దానిని మ్రింగి సద్యో గర్భమున ఒక ఆడ శిశువును ప్రసవించి తన ద్రోవను వెడలిపోయెను. భిల్లరాజ దంపతులు వన విహారానికేగి ఆ బిడ్డను చూశారు.

ఆ॥ చోద్యమేమొ గాని జొప్పించి ధారయై
ఆ పుళిందు పత్ని అమ్మవోలె
పాలు ద్రాపె శిశుకు వల్లీ అనన్ బిలిచి
ప్రేమ దీర వారు పెంచుకొనిరి



వ॥ ఓ కార్తికేయా! ఇక ఆ అన్నులమిన్న సొగసు జూడతరమా....

సీ॥ బంగారు కణికయై, వనలక్ష్మియా ఈమె
వర్ణించ నీమెను వలను కాదు
చిగురాకులై ద్రోచె చెలిపాద యుగ్మంబు
అరటి బోదలు బోలు ఆమెయురులు
సింగపు నడుముతో చిన్నారి నడయాడు
చక్రవాకములు కుచములు చెలికి
నేత్ర యుగ్మంబది నీలోత్పలంబులు
తోచె ముంగురులవి తుమ్మెదలుగ

తే॥ దివ్య పరిమళంబును బూని దీర్చె తనువు
ఏడు మల్లెలు తూగునా ఈమె బరువు
అనెడి సుకుమారి ఆ వల్లి ఆమె నీకు
తగును భార్యగా నామాట తథ్యమగును



వ॥ చల్లగా ఆ మాటలు చెవిని వేసి నారదుడు అచటనుండి భిల్లపురమునకు బోయి పుళిందుని జూచి అతిథి సత్కారములను గొని ఆశీర్వదించాడు.

ఆ॥ సుతను భిల్లరాజు జూపించి మౌనికి
కాళ్ళు మ్రొక్కజేసి గౌరవమున
ఎవరు తగును స్వామి! ఈమెను జేబట్ట
తెలుపుమయ్య శంక దీర్పుమయ్య

వ॥ ఆ మాటలన్న పుళింద దంపతులను జూచి నారదముని ఇలా అన్నాడు.

తే॥ పైడి కబ్బెను సౌగంధ పరిమళంబు
అన్న రీతిని ఈబాల అమల చరిత
కార్తికేయుని జేబట్ట గలదటంచు
బ్రహ్మ మాటల మధ్యలో బలికెనాతొ

వ॥ మేనులు పులకరించిన పుళింద దంపతులు నారదుని కీర్తించారు. వల్లీ దేవి మనస్సున కుమారస్వామి స్థిరంగా నెలకొన్నాడు. మునీంద్రుడు వెడలిపోయాడు. ఇక్కడ వల్లీ సౌందర్యం తలచి మరులు గొన్న కార్తికేయుడు,

కం॥ తలచుచు వల్లిని స్కందుడు
చెలియా! నువు లేక నేను జీవించంగా
తలపను నీ దరిజేరక
కలిగియు ప్రాణాలు మేలె? కమలదళాక్షీ!

సీ॥ ఈ నారదుండేల ఇచటకు రావలె?
వచ్చె బో నాకేల వార్త జెప్పె
జెప్పె బో వల్లికై చింత కలుగనేల?
కలిసె బో మోహంబు వెలయ నేల?
వెలసె బో మదనుండు విరి తూపులన్ గొట్టి
వేదింప నేలనాన్ మదిని కలచి
మంచి చెడ్డలు లేని మనసిజునకు 'నీతి'
తగునని నేనేల తలచు చుంటి?



తే॥ హరుని బాధించినందుకే అంతమయిన
వాడు నీతి బాహ్యుండన్న వంతయేల?
విరహ వేదన నాకెట్లు తీరగలదు?
తరుణి జేపట్టు టొక్కటే తగును నాకు

వ॥ ఆహా! నా ఆలోచన యెంత తప్పు.

కం॥ స్త్రీ పురుషులు గామించుచు
కాపురములు జేసి స్త్రీల గలియక నున్నన్
ఈ పుడమి నిర్జనంబై
ఆ పరమేష్ఠియు సృష్టి అంతంబవదే?

వ॥ ఏదియేమయినా నేను వల్లిని పరిణయమాడి తీరెదను అని నిశ్చయించుకుని పార్వతీ పరమేశ్వరుల అంగీకారం బొంది, భార్య దేవసేన అనుమతిని బొందిన వాడై



కం॥ కానున్న దేది అయినా
ఏనాటికి కాక తప్పదిది నేర్చియునే
నీనాడు చింత జెందుచు
మానక అజ్ఞానుడైతి మదనుని 'దయచే'

వ॥ ఇక ఇట్లు చింతించుచూ గూర్చుండి లాభము లేదని భిల్ల పురమునకు సమీపమున గల వనమునకు విహారము జేయుటకు బోయెను ఇక్కడ వల్లీదేవి విరహము వర్ణనా తీతముగా నున్నది. ఆమె ఇట్లా ఆలోచించ సాగింది.

ఉ॥ ఎక్కడ కాననాంతరము లేలెడి భిల్లుని
ముద్దు బిడ్డ తా
నెక్కడ ఆది దంపతుల కీప్సితమిచ్చెడి
దక్షుదౌసుతం
డెక్కడనైన జూచెదమె? యెవ్విధి పెండ్లగు?
బ్రహ్మ వ్రాసినన్
జక్కగ వ్రాయుగాక యిక జచ్చుటె మేలగు
భిల్ల కన్యకున్



వ॥ నేను అత్యాశకు బోతున్నాననుకున్నా

ఉ॥ నీచుని వద్దనైన, తగు, నేర్వగ నొప్పును
విద్య యుత్తముల్
నీచము కాదు, విద్య గణనీయుని జేయును
అల్పునైననున్
నీచకులాంగనన్ బుధులు నెమ్మిని పెండ్లిని
యాడవచ్చు, ఆ
లోచన మాని 'పద్మిని' ని లోకము మెచ్చని పెద్దలందురే

వ॥ మరి ఈ షణ్ముఖుడు నన్నేల బెండ్లాడరాదు?

ఆ॥ పరమ శివుని మెప్పు బడసిరి యెందరో
హీనకులజులన్న గణన లేక
జగతినేల నాకు జగపతి కోడలౌ
భాగ్యమబ్బు నేమొ? వానిదయతొ

వ॥ నా అదృష్టము జేత నేను స్కందుని గలిసిన నా సమాచారము నెరిగింతునని తలంచి ధైర్యము జేసి స్త్రీ సహజమైన బిడియమును విడనాడి, చతురిక అను జెలికత్తెతొ గలిసి వనమునకు బోయెను. తల్లిదండ్రులకు ఈ సమాచారం తెలియదు.

ఆ॥ బ్రహ్మ వేయు ముడిని వలదనన్ వేరికొ
వల్లి చెలియ కలిసె వనిలొ గుహుని
వల్లి పేరు దలచి వగచెడి పురుషుడే
కార్తికేయుడంచు గుర్తెరింగె

కం॥ ఎవ్వరు మీరలు యిచ్చట
కెవ్వరు రాకూడదయ్య ఈ విధి వినుమా
ఇవ్వని వల్లీదేవిది
జవ్వనిమా రాకుమార్తె చంద్రవదనయున్

వ॥ దానికి షణ్ముఖుడిలా అన్నాడు



తే॥ తరుణి నీపేరు ఏమది యెరుగ జెప్పు
యేను శివపార్వతీ సుతుండను కుమార
స్వామి యనుపేరు నాకుండె జగతి నెరుగ
వల్లి సౌందర్యమును విని వచ్చినాను.

వ॥ దానికామె ఆహా! ఏమి నాభాగ్యము వెదుకబోయిన తీగె కాలికి తగిలినట్లు ఈ కార్తికేయుడు నాకు తారస బడెను కదా! అనుకొని

కం॥ నను చతురికయని అందురు
వినుమయ్యా వల్లి సఖిని వేల్పుల నేతా?
తన నిటదెత్తును దెల్పుము
మనసున నీకున్నమాట మా సఖి దెలియన్

వ॥ ఆ విధంగా చతురికచే పరిచయం చేయబడి ఒకరి హృదయం ఒకరు తెలుసుకొని, ప్రేమ వికసించి వివాహం చేసికొనుటకు నిశ్చయించుకొని



కం॥ వెరపును మానుము నెచ్చెలి
పరమేశుని ఆన నిన్ను పరిణయమౌదున్
వెరువను పరులకు తరుణీ!
విరహము దీర్చంగ రమ్ము పెండ్లాడెదనిన్

వ॥ దానికా వల్లీదేవి అభ్యంతరం జెప్పింది

కం॥ కన్నెను దానము గొనవలె
కన్నియ పిత కాళ్ళు కడిగి కాదనకుండా
కన్నెను చేతికి నీవలె
నిన్నెన్నిన కన్నె నీది నీజతయంచున్

వ॥ అప్పుడు కుమార స్వామి, గడుసు దానివే సుమా! నీ తండ్రిదే పైచేయి జేయుచున్నావు మీ ఆడువారు ఎంత గడుసరులు! మీ భిల్ల కన్యలు బెదురులేని వారనుట నిక్కము, ఇక్కడ.....



ఉ॥ జింకలు సుందరాంగులను చిత్రముగా
ప్రసవించునా! అనన్
శంక అదేల నన్నడుగ షణ్ముఖ! బిడ్డలు
రెల్లు గడ్డిలో
పొంకము దీరబుట్టి తను పుత్రుని వోలె
మునీంద్ర భామలన్
శంకర పత్నికిన్ బదులు స్తన్యము గ్రోలిన
నీకు దెల్వదా!

కం॥ సరసపు చతురోక్తులతో
పరమేశుని పుత్రుడామె వలపును గెలిచెన్
అరుదెంచి రాజు రాణియు
పరివారము తోటి స్కందు ప్రార్థించి రటన్

వ॥ ఓ కార్తికేయా! నీకు మావల్లి యందుగల అనురాగము దెలిసి ధన్యులమైతిమి. మా పూర్వజన్మ పుణ్యముచే, శంకరునకే వియ్యంకుల మవుతున్నాము.

తే॥ విడిది జని గొను స్వాంతము, పెండ్లి రేపు
తెల్లవారిన జరుగును, తెలుపగలము
పార్వతీ పరమేశులు బంధులకును
చారులను బంపి ఈ వార్త సత్వరముగ

వ॥ కామ గమనము గలిగిన తమచారులతోను, నారదమునీంద్రుని సాయంతోనూ, దేవతల చారుల వల్లను ఈ వార్త, స్వర్గ, పాతాళ, భూలోకములందును, బ్రహ్మ, సత్యలోకమునందును, శ్రీహరికి వైకుంఠము నందును, శివ పార్వతీ సహిత శివ గణంబులకును ఒకే కాలమున తెలుపుటయే గాక వెంట బెట్టుకుని తీసుకు రావటం కూడా జరిగింది. దేవసేన పర్యవేక్షణలో వివాహం వైభవంగా 'నభూతో న భవిష్యతి' అనునట్లు జరిగింది.



చం॥ తను, సతి దేవసేన, పతి దాపున నిల్చెను
ప్రేమ జూపుచున్
కనులకు పండ గన్నటుల స్కందుడు వల్లిని
బెండ్లియాడగా
వనజభవుండు, శ్రీహరియు, పార్వతి, శూలియు
దేవనాథులున్
మనసుల సంతసం బలర మాన్యులు
దీవెన లిచ్చిరంతటన్

వ॥ ఓ మహామునులారా! మీ ద్వారా లోకానికి ఈ గాథలు వివరించి నేను నా జీవితం చరితార్థం చేసికొన్నా నని జెప్పి సూత మహాముని సెలవు తీసుకున్నాడు.



# ఫలశ్రుతి

చేసిన ప్రతి పనికీ ఫలితం కోరుకునే వారికి...

1. ఇది భక్తితో జదివిన విదురులకు, విధవలకు తమ జీవన సహచరుల వియోగ సహన మనో ధైర్య ప్రదానం.
2. దుర్మార్గ శత్రు పీడా నిర్మూలనం
3. సత్ సంతాన ప్రాప్తి
4. పుత్రికా వివాహం
5. మనోహరులతో పరిణయం
6. సిరి సంపదలు తరుగు లేకుండుట
7. బంధు పునస్సమాగమము
8. పుత్రులు పేరు ప్రఖ్యాతులు గాంచుట
9. వంశాభివృద్ధి
10. లోక కళ్యాణం జరుగుతుంది



# చివరికి నా మనవి

కం॥ పలుకులు పలుపలు విధములు
పలుగాకుల పలుకు లెపుడు బాధాకరమే
విలువగు చేతలు సలుపుట
సలుపుచు సత్కర్మ శివుని సాధింతురుగా

కం॥ ఎవడీ సుబ్రహ్మణ్యము
ఎవడీ దీక్షితులు వాడు ఈ కథ వ్రాయన్
ఎవడాతని కిది నేర్పెను
ఎవడా? శంకరుడె, మీకు ఇంకా శంకా?

ఆ॥ తెలుగు పండితుడన? దేవ! నే గానయ్య
గొప్ప భక్తుడనిన నొప్పు గాదు,
నీవు ఆవహించనే వ్రాసి నానేమొ
నీదు లీల తండ్రి! వాదమేల?

సీ॥ దక్షయజ్ఞము మించి దాటలేననుకొంటి
నెరవేరె నాకోర్కె నీలకంఠ!
గిరిజ కళ్యాణంబు జరుగునా యనుకొంటి
పరమేశ్వరా! నీకు వధువు దొరికె
తారక సంహారమేరీతి జరుగునో
అనుకొంటి షణ్ముఖుండదియు జేసె
ఎట్లు ముద్రింతును ఇది భారమనుకొంటి
కంప్యూటరొచ్చెను కావ నన్ను

ఆ॥ ఉంచు వాడవీవె ద్రెంచువాడవు నీవె
దాని దెలియలేక దారితప్పి
నేను నాకఉ నాదియనుకొంటి హే ప్రభూ!
కన్నులున్న గుడ్డిగాచునెవడు?



సీ॥ ప్రారబ్ధమునుదాట వలనుగాకే కదా!
సతినివీధిన్ హరిశ్చంద్రుడమ్మె
ప్రారబ్ధమునకు తాబానిసయై కదా!
తరుణి కోర్కెకు జచ్చె దశరధుండు
ప్రారబ్ధమున జిక్కి బలహీనయై కదా!
పతిబాసి లక్ష్మి సవతిని బొందె

ఆ॥ ఏ యుగంబునైన ఎవ్వరు గెలిచిరి?
పరమ శివుడు కూడ బాధ మింగె,
నుదుటి గీత తుడుప కాదురఆ సాధ్యంబు
బ్రహ్మకైన వాని 'బాబు' కైన.



# అంకితం

చం॥ హరి కరుణాంతరంగుడయి ఆదు కొనన్
తొలిగీత జెప్పితిన్
హరుడదె రీతి బ్రోవ, నను, ఆది గురున్
తెనిగించినాడ, యా
హరి హరులొక్కటేయనుచు అందగ
బుర్రకు, దీని వ్రాసితిన్
హరిహర నందనుండితడు 'అయ్యప'
కంకితమిత్తు నీకృతిన్



# మంగళం

దక్షుని మూర్ఖత శిక్షగ తనువును
వదలిన 'సతి' కిదె మంగళము

గిరిజగ మారి తనా గిరిరాజును
అలరించిన దేవికి మంగళము

తారకువేదన, తాడన నాపిన
షణ్ముఖునకు యిదె మంగళము

దేవసేనపతి ధరకుమారునకు
దివ్యంబైనది తిరు మంగళము

షణ్ముఖు వలపుల ఉల్లము దోచిన
వల్లీ భామకు తిరుమంగళము